28న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 28న నిర్వహించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి నిర్ణయించారు. స్టాండింగ్ కమిటీకి ఈనెల ఏడున ఎన్నిక నిర్వహించగా, పది స్థానాలనూ కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో ఇప్పటివరకు సమావేశం నిర్వహించలేదు. నూతన సభ్యులతో తొలి సమావేశం కావడంతో కమిషనర్ హాజరుకానున్నారు. ఇందుకోసం 300కిపైగా అంశాలతో ఎజెండా సిద్ధం చేశారు. వీటిలో 130కిపైగా అంశాలు మెకానికల్ విభాగానికి సంబంధించినవేనని తెలిసింది.

28న మంత్రి లోకేశ్ రాక



- 29న కోర్టుకు హాజరు, ముఖ్యనేతలతో భేటీ
- 30న పాఠశాలల తనిఖీ, అధికారులతో సమీక్షలు
- పార్టీ కార్యాలయం వద్ద బస్సులోనే బసచేయనున్న యువనేత
- 31న ఉదయం తిరిగి విజయవాడకు

విశాఖపట్నం, 25 (ఆంధ్రజ్యోతి):

ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నాలుగు రోజుల పర్యటన కోసం ఈనెల 28వతేదీన నగరానికి రానున్నారు. విజయవాడలో ఆరోజు సాయంత్రం బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నేరుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చి, పార్టీ ముఖ్యనేతలతో భేటీ అవుతారు. ఆ తరువాత అక్కడే బస్సులో బసచేస్తారు. ఈనెల 29వతేదీ ఉదయం సీతంపేట రాజేంద్రనగర్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి అల్పాహారం తీసుకుంటారు. అక్కడినుంచి జిల్లా కోర్టుకు వెళ్లి సాక్షి పత్రికపై దాఖలుచేసిన పరువునష్టం దావా కేసులో వాయిదాకు హాజరవుతారు. మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి చేరుకుని ముఖ్యనేతలు, పార్టీ కేడర్‌ను కలుసుకుంటారు. రాత్రికి అక్కడే బసచేస్తారు. ఈ నెల 30వ తేదీ ఉదయం పాఠశాలల పనితీరుపై విద్యాశాఖాధికారులతో సమీక్షించిన అనంతరం నగరంలోని ఒక ట్రెండు పాఠశాలలను తనిఖీచేస్తారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారు. తరువాత పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు. ఈనెల 31వ తేదీ ఉదయం తిరిగి విజయవాడ బయలుదేరి వెళతారు.

ఘన స్వాగతానికి ఏర్పాట్లు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా మంత్రి లోకేశ్ నగరానికి వస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, నేతలు ఆళ్ల శ్రీనివాసరావు, రాజశేఖర్, వి.భరత్, బుగత సత్యనారాయణ సమావేశమై సన్నాహాలపై చర్చించారు. ఈనెల 28న పార్టీ శ్రేణులు భారీగా ఎయిర్‌పోర్టుకు చేరుకుని లోకేశ్‌కు ఘన స్వాగతం పలకాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించాలని ఆదేశించారు.



మంత్రి లోకేశ్ పర్యటనపై పార్టీ కార్యాలయంలో సమావేశమైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఇతర నాయకులు

టెండర్లలో మాయాజాలం!



ఎల్‌ఈడీ లైట్ల సరఫరాకు 41 శాతం లెస్‌కు ఖరారు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లలో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచినపుడు 40 శాతానికి పైగా లెస్‌కు కాంట్రాక్టర్లు టెండర్లు వేయడం ఆరోపణలకు బలాన్ని చేకూర్చుతోంది. అంత తక్కువకు టెండర్‌వేసి పనులుచేస్తే భారీగా నష్టం వస్తుందని, అధికారులతో ముందస్తు అవగాహన మేరకు సగం పనిచేసి, పూర్తిగా చేసినట్టు రికార్డుల్లో నమోదుచేయించుకుని, బిల్లులు తీసుకుంటున్నారని కొంతమంది కాంట్రాక్టర్లే చెబుతుండడం విస్మయానికి గురిచేస్తోంది.

- సీసీ డ్రైయిన్స్ మరమ్మతులకు 25 శాతం లెస్‌కు
- జీవీఎంసీలోని అన్ని విభాగాల టెండర్లలోనూ ఇదే పరిస్థితి
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన ఇంజనీర్లు
- అంచనాలను పెంచి టెండర్లు పిలుస్తున్నారని అనుమానం
- సగం పనిచేసినా పూర్తిగా చేసినట్టు రికార్డు చేస్తున్నారనే ఆరోపణలు
- జీవీఎంసీ కమిషనర్ దృష్టిసారించాలంటున్న ఓ వర్గం కాంట్రాక్టర్లు

జీవీఎంసీ పరిధిలో ఏటా సుమారు రూ.750 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతుంటారు. వీటన్నింటికీ ఇంజనీరింగ్ విభాగంలో అంతర్భాగమైన పబ్లిక్‌వర్క్స్, నీటి సరఫరా, యూజీడీ, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల అధికారులు టెండర్లు పిలుస్తారు. ఏదైనా ఒక అభివృద్ధి పని చేయాల్సి ఉందని ఇంజనీరింగ్ అధికారులు భావిస్తే ముందుగా ఆ జోన్/వార్డు ఏఈ స్థాయి అధికారి ఆ పని పూర్తిచేయడానికి అవసరమైన పరికరాలు, కూలీల ఖర్చు, సామగ్రి రవాణా ఖర్చులను స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) ప్రకారం లెక్కించి అంచనాలు తయారుచేస్తారు. వాటిని పరిశీలన కోసం సంబంధితజోన్ డీఈకి పంపిస్తారు. అక్కడ డీఈ, ఈఈ స్థాయి అధికారులు అంచనాలన్నీ ఎస్ఎస్ఆర్ రేట్స్‌కు అనుగుణంగా ఉన్నాయా? లేదా పరిశీలించి టెండర్ పిలవడానికి ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఉన్నతాధికారుల ఆమోదంతో ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పిలుస్తారు. టెండర్ మొత్తంలోనే కాంట్రాక్టర్ ప్రాఫిట్ కింద 13శాతం, జీఎస్‌టీ 18 శాతం కలిసి వుంటుంది.

టెండర్ నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అర్హత, ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు ఆ పనిచేస్తే ఎంత గిట్టుబాటవుతుందనేది చూసుకుని బిడ్‌లు దాఖలు చేస్తుంటారు. టెండర్ దక్కించుకోవాలని తాపత్రయపడేవారు సాధారణంగా తమకు వచ్చే లాభంలో కొంత తగ్గించుకుని బిడ్ దాఖలు చేస్తారు. అంటే కాంట్రాక్టర్ ప్రాఫిట్‌గా పేర్కొన్న 13 శాతంలోనే గరిష్ఠంగా తగ్గించుకోవాలి. అంతకంటే ఎక్కువ లెస్‌కు బిడ్ వేస్తే నష్టమే.

కానీ జీవీఎంసీలో దీనికి విరుద్ధంగా టెండరు ప్రక్రియ జరగడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒక్కో టెండర్‌కు ఏకంగా 41 నుంచి 45 శాతం తక్కువగా కాంట్రాక్టర్లు బిడ్‌లు వేయడం, అభ్యంతరం వ్యక్తంచేయకుండా అధికారులు పనులు అప్పగించేయడం అనుమానాలకు దారితీస్తోంది. ఇటీవల జోన్-2 పరిధి తొమ్మిదోవార్డులో 20, 45, 60, 120 వాల్ట్స్ ఎల్‌ఈడీ లైట్ల సరఫరా, అమర్చడానికి ఎలక్ట్రికల్ విభాగం అధికారులు టెండర్లు పిలిచారు. బిడ్‌లను రెండురోజుల కిందట తెరవగా ఏకంగా 41శాతం తక్కువకు ఓ కాంట్రాక్టర్ కోట్ చేయడం ఆశ్చర్యానికి గురిచేసింది. అంత తక్కువగా కోట్ చేయడంతో పాటు జీఎస్‌టీ 18 శాతం పోతే మిగిలిన 41 శాతం మొత్తంతో పని ఎలా పూర్తిచేస్తారో ఆ కాంట్రాక్టర్, ఆమోదించిన ఇంజనీరింగ్ అధికారులే చెప్పాలి. అదేవార్డు పరిధిలో కొండవాలు ప్రాంతాలైన సింహగిరికాలనీ, ప్రశాంతినగర్‌లో సీసీ డ్రెయిన్స్ రిపేర్లకు రూ.16.49 లక్షలతో ఒకటి, రూ.16.16 లక్షలతో మరో పనికి టెండర్లు పిలిచారు. వాటిని శనివారం అధికారులు తెరవగా ఓ కాంట్రాక్టర్ 25 శాతం తక్కువకు టెండరు దక్కించుకున్నారు. ప్రస్తుతం ఇసుక కొరతతో ధరలు పెరిగిపోయాయని, దీంతో పాటు బీఆర్‌టీఎస్‌రోడ్డు పైనుంచి కొండమీదకు సుమారు 500 మీటర్లు కూలీలతో మెటీరియల్ పెరికించుకోవాల్సి ఉన్నా 25 శాతం తక్కువకు ఎలా బిడ్ వేశారో తెలియక మిగిలిన కాంట్రాక్టర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా విభాగంతోపాటు యూజీడీ నిర్వహణ విభాగంలో ఆరు పనులకు అధికారులు ఇటీవల టెండర్లు పిలిస్తే, 30 శాతం తక్కువకు ఓ కాంట్రాక్టర్లు పనులను దక్కించుకోవడంతో మిగిలిన వారు అవాక్కయ్యారు.

అధికారులతో మిలాఖత్

ఇంజనీరింగ్ విభాగంలో కొంతమంది అధికారులు తమకు అస్మదీయులుగా భావించే కాంట్రాక్టర్లతో ముందస్తు అవగాహన కుదుర్చుకుని, అడ్డగోలు బిడ్‌లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిపనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసినప్పుడే సదరు కాంట్రాక్టర్లను దృష్టిలో పెట్టుకుని అంచనాలను భారీగా రూపొందించి, వారితో అతి తక్కువకు టెండర్లు వేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతతక్కువకు బిడ్ వేసినప్పటికీ అభ్యంతరం చెప్పకుండా వర్క్‌ఆర్డర్ జారీ చేయడం ఈ ఆరోపణలకు బలం చేకూర్చుతోంది. కాంట్రాక్టర్ తమ వారే కావడంతో సగం పని చేసినా, మొత్తం పూర్తయినట్టు ఎంబుక్‌తోపాటు బిల్‌రికార్డింగ్ చేయించి తమ వాటా నొక్కేస్తున్నారని చెబుతున్నారు. పనుల్లో నాణ్యత లోపించినా పట్టించుకోకుండా సహకరిస్తుండడంతో అడ్డగోలు వ్యవహారాలు సాగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. సాధారణంగా టెండరు పిలిచినపుడు ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం అంచనాలను రూపొందించి, కాంట్రాక్టర్‌కు ప్రాఫిట్ మార్జిన్ కింద 13 శాతం కలిపి టెండర్ పిలిస్తే, 40 శాతానికిపైగా లెస్‌కు ఎందుకు టెండర్

... మిగతా 6వ పేజీలో

తీరానికి పోటెత్తిన సందర్శకులు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

తీరానికి ఆదివారం సందర్శకులు పోటెత్తారు. సముద్రంలో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. మరికొంత మంది సెల్ఫీలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆర్కే బీచ్ నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు బీచ్ కిక్కిరిసింది. ఇదిలా ఉండగా ఆటుపోట్ల కారణంగా ఆదివారం సముద్రం వెనక్కి మళ్లింది. దీంతో రాళ్లు బయటకు కనిపించాయి. వాటిపైకి ఎక్కి పలువురు ఫొటోలు తీసుకున్నారు.



ఆర్కే బీచ్‌లో సందర్శకులు

ఆర్మీ కల.. నెరవేరనున్న వేళ!

- పోర్టు స్టేడియంలో నేటి నుంచి ఆర్మీ ర్యాలీ
- వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహణ
- రోజుకు 500 నుంచి 800 మంది హాజరు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- వార్త 8వ పేజీలో



అభ్యర్థుల కాల్‌లెటర్లను పరిశీలిస్తున్న ఆర్మీ సిబ్బంది

విమ్స్‌లో సీబీఆర్ఎన్ సెంటర్

విపత్తుల సమయంలో మెరుగైన వైద్య సేవలందించే వీలు



- దేశంలో పది చోట్ల సెంటర్ల ఏర్పాటుకు కేంద్రం యోచన
- 28, 29 తేదీల్లో విమ్స్‌కు రానున్న కేంద్ర బృందం
- భవనం డిజైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం
- సిబ్బందికి నైపుణ్య శిక్షణ అందించనున్న కేంద్ర ప్రభుత్వం

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సెకండరీ లెవెల్ కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. దేశ వ్యాప్తంగా పది రాష్ట్రాల్లో ఈ తరహా సెంటర్లు ఏర్పాటు చేయనుండగా రాష్ట్రానికి ఒక కేంద్రాన్ని మంజూరు చేసింది. దీనిని విమ్స్‌లో ఏర్పాటుచేయనున్నారు. ఇందుకోసం రెండు ఎకరాల స్థలాన్ని ఇప్పటికే విమ్స్ అధికారులు కేటాయించారు. రెండు అంతస్థుల్లో భవన నిర్మాణాన్ని చేపట్టి అత్యాధునిక వసతుల ను సమకూర్చనున్నారు.

సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాద బాధితులకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ సెంటర్‌లో ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమిస్తారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేలా వారికి అడ్వాన్స్‌డ్ శిక్షణ అందిస్తారు. సెంటర్ ఏర్పాటుకు సంబంధించి నిపుణుల బృందం ఇప్పటికే రెండుసార్లు విమ్స్‌ను సందర్శించింది. ఈ నెల 28, 29 తేదీల్లో మరోసారి కేంద్ర బృందం రానుంది. ఈ పర్యటనలోనే భవన నిర్మాణానికి సం బంధించిన ప్లాన్‌ను విమ్స్ అధికారులకు ఇవ్వనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరికి నిర్మాణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం

ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ఫార్మా పరిశ్రమ ల్లో పెద్దఎత్తున ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎంతో మం ది ప్రాణాలను కోల్పోతుండగా, మరింతమంది తీవ్ర గాయాల పాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గడిచిన ఐదేళ్లలో వందకుపైగా ఈ తరహా ప్రమాదాలు సంభవించగా, వంద మందికి పైగా మృత్యువాత పడ్డారు. ఇటువంటి ప్రమాదాల్లో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ప్రస్తుతం ప్రభుత్వ రంగంలోని కేజీహెచ్ మాత్రమే కనిపిస్తోంది. అక్కడా మెరుగైన వైద్య సేవలు అందడం

... మిగతా 6వ పేజీలో

ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో

మాజీ ఓఎస్‌డీ హల్‌చల్

- ప్రిన్సిపాల్ చాంబర్‌లోనే అనధికారిక కార్యకలాపాలు
- సహకరిస్తున్న ఇన్‌చార్జి వీసీ



విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఇప్పటికీ మాజీ ఓఎస్‌డీ హవా కొనసాగుతోంది. ఎన్నడూ లేని విధంగా గత పాలకులు ఏయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఓఎస్‌డీని నియ మించారు. దీంతో అతను ప్రిన్సిపాల్‌తో సహా ఇతర అధికారు లను డమ్మీలుగా మార్చి వ్యవహారాలన్నింటినీ చక్కబెట్టేవా రన్న విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీసీ, రిజిస్ట్రార్ సహా ఓఎస్‌డీ రాజీ నామా చేశారు. కొద్దిరోజులపాటు వర్సిటీకి దూరంగా ఓఎస్‌డీ మళ్లీ అనధికారికంగా తన కార్యకలాపాలను చక్కబెడుతున్నారు. కీలకఫైళ్లను ఆయనే చూస్తున్నట్టు చెబుతున్నారు. కొద్దిరోజుల కిందట బెస్ట్ టీచర్ అవార్డుకు పలువురు దరఖాస్తు చేసుకోగా, వాటిని ఇతడే పరిశీలించి ఫైనల్ చేసినట్టు చెబుతున్నారు. వర్సిటీకి సంబంధించిన పరీక్షల నిర్వహణ, పీజీ సెట్ ఆఫీస్‌లో పనిచేసే సీనియర్ అధ్యాపకులపై అవమానకర రీతిలో వ్యవహరిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు వాపోతున్నారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ శశిభూషణరావు తన చాంబర్‌లోనే ఈ అనధికార వ్యక్తికి పెత్తనాన్ని అప్పగించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ జరిగే వ్యవహారాలు, వర్సిటీలో కీలక నిర్ణయాలను మాజీ ఓఎస్‌డీ పాత వీసీకి అప్‌డేట్ చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ మాజీ ఓఎస్‌డీ అడ్జెంక్ట్ ప్రొఫెసర్ హోదాలో హల్‌చల్ చేస్తున్నారని చెబుతున్నారు. తనవికాని కార్యకలా పాల్లో తల దూర్చుతున్నారని, అతనిని తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నీటి వనరుల పరిరక్షణపై దృష్టి

జిల్లా యంత్రాంగం బృహత్తర ప్రణాళిక

- ఉనికి కోల్పోతున్న వనరుల గుర్తింపునకు సర్వే
- చెరువులు, గెడ్డలు, వాగుల్లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు
- మురుగు నీటి శుద్ధి, సింహాచలం ధారల రక్షణకు యత్నాలు



పూడికతో నిండిన కొత్తపాలెం పెద్ద చెరువు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

మహా నగరంలో ప్రజల తాగు నీటి ఇబ్బందులను తొలగించడంతో పాటు సహజ నీటి వనరుల పరిరక్షణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉనికి కోల్పోతున్న నీటి వనరుల గుర్తింపునకు సర్వే నిర్వహించేందుకు సమాయత్తమవుతోంది. అదే సమయంలో చెరువులు, వాగులు, గెడ్డల్లో ఆక్రమణలను తొలగించేందుకు కసరత్తు చేస్తోంది. కొండల నుంచి వచ్చే ధారల పరిరక్షణకు నడుం బిగిస్తోంది. భవిష్యత్తు నీటి అవసరాలను గుర్తించి, ఇప్పటి నుంచే చర్యలకు ఉపక్రమించనుంది.

శరవేగంగా విస్తరించిన విశాఖ నగరం తన సహజ సిద్ధమైన గుర్తింపును కోల్పోతోంది. పెరుగుతున్న జనాభా అవసరాల కోసం ప్రకృతి వనరుల వాడకం, కొండవాలు, గెడ్డలు, వాగులు, చెరువుల్లో ఆక్రమణలు పరిస్థితిని మరింత జటిలం చేస్తున్నాయి. నగర విస్తరణలో భాగంగా శివారు ప్రాంతాల్లో చెరువులు, గెడ్డలు అదృశ్యమయ్యాయి. సాగు భూముల్లో వ్యాపార, వాణిజ్య, గృహసముదాయాలు రావడంతో చెరువులు ఉనికి కోల్పోయాయి. కొన్ని చోట్ల కాలనీల నుంచి వచ్చే మురుగునీటితో సమీప చెరువులు నిండిపోయాయి. భూగర్భజలాలపై తీవ్ర ఒత్తిడి పెరిగి 500 అడుగుల లోతుకు పడిపోయాయి. ఈ నేపథ్యంలో అధికశాతం మందికి సరైన తాగునీరు లభించడంలేదు. భవిష్యత్తులో నీటికి మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తించిన ధ్యాన్ ఫౌండేషన్ కు చెందిన ఇంజనీరింగ్ ప్రతినిధులు రెండేళ్లుగా నగరం, శివారు ప్రాంతాల్లోని నీటి వనరులపై అధ్యయనం చేస్తున్నారు. ఈ మేరకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు నివేదించారు.

విశాఖ మహా నగరం బౌల్ ఏరియాలో ఉంది. ఒక పక్క యారాడ, మరోవైపు నరవ, ఇంకోవైపు సింహాచలం కొండలు, తూర్పున సముద్రం ఉంది. నగరంచుట్టూ అనేక చెరువులు, వాగులు, గెడ్డలు ఉండేవి. రానురాను పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. ఏడాదిలో ఎక్కువ రోజులు కురిసే వర్షం

... మిగతా 6వ పేజీలో

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను అందిస్తున్న సీనియర్ పాత్రికేయుడు ఆడారి కొండలరావు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిధి అల్లిపురంలోని గ్రంథాలయానికి సీనియర్ జర్నలిస్ట్ ఆడారి కొండలరావు రూ. 20 వేల విలువైన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాహిత్య గ్రంథాలతోపాటు జర్నలిజానికి సంబంధించిన పుస్తకాలను ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలని అన్నారు. గ్రంథాలయాల పఠనం వల్ల విజ్ఞానం పెంపొందుతున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు ఇంతగా పురోభివృద్ధి సాధించడం వెనుక పుస్తక పఠనం ఎంతో ఉంటుందన్నారు. సృజనాత్మకకు సాహిత్య పుస్తకాలు తోడ్పడతాయన్నారు. యువత పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటగౌరీ సంఘం ప్రతినిధులు, గ్రంథాలయ పాలకవర్గం పెద్దలు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ కోచ్‌గా మురళీకృష్ణ



మురళీకృష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 25: పారిస్ జరిగే పారా ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత బ్యాడ్మింటన్ జట్టు కోచ్‌గా నగరానికి చెందిన ఇంటర్నేషనల్ షట్లర్, లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ ఎంవీ.మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు ఆదివారం తన కార్యాలయంలో మురళీకృష్ణను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మక పారా ఒలింపిక్స్‌కు భారత్ బ్యాడ్మింటన్ కోచ్‌గా మురళీకృష్ణ నియమితులు కావడం నగర క్రీడారంగానికి గర్వకారణమన్నారు. ఈనెల 28 నుంచి జరిగే పారా ఒలింపిక్స్‌లో భారత షట్లర్లు దేశానికి పతకాలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

మురళీనగర్, ఆగస్టు 25 ; గ్రేటరు 50వవార్డు మురళీనగర్ వాకర్స్‌క్లబ్ అధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఐ ఫౌండేషన్ నుంచి వచ్చిన వైద్యులు బి.సమృద్ధి, ఆర్. దేశ్‌ముఖ్ రోగులకు తనిఖీల నిర్వహించారు. కళ్ల రక్షణపై పలు సూచనలు చేశారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ వాడకంలో కంటికి తగిన విశ్రాంతి ఇస్తు వినియోగించాలన్నారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శిబిరంలో వసతులు కల్పించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



నిరసన తెపుతున్న కార్మికులు, ఏఐటీయూ నాయకులు

సీతమ్మధార, ఆగస్టు 25: ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఏఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విశాఖలో జరుగనున్న ఏఐటీయూసీ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ సీతమ్మధార కేఆర్ఎం కాలనీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ,ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 3వ తేదీన విశాఖ సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ బొమ్మ వరకు జరుగు మహాప్రదర్శనలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావి కృష్ణ, కె.మోహన్. పి.రాము, ఆర్. జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవ పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 25: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికారం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి క్రీడా పోటీలతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నాయని సంస్థ క్రీడాధికారి జూన్ గ్యాలియట్ ఒక ప్రకటనలో తెలిపారు. రేస్ వాక్, వాలీబాల్, హాకీ (పెనాల్టీ షూటౌట్స్), 5ఏ సైడ్ ఫుట్బా ల్ (మినీ ఫుట్‌బాల్), టెన్నిస్ బాల్ క్రికెట్, బ్యాడ్మింటన్, చెస్, 3ఏ సైడ్ బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, ఖోఖో, రోప్ జంపింగ్‌తోపాటు లెమన్ రేస్, లగోరి లంగడి, ప్లాంక్ చాలెంజ్ క్రీడాంశాలలో పోటీలుంటాయని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి ఈనెల 29న జరిగే జాతీయ క్రీడా దినోత్సవం రోజున బహుమతులందిస్తామన్నారు. అలాగే, జాతీయ, అంతర్జాతీయ, జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను సన్మానిస్తామన్నారు.

నత్తనడక పనులతో అవస్థలు

» జాషువానగర్‌లో నెలల తరబడి నిర్మాణం

కంచరపాలెం, ఆగస్టు 25 : జీవీఎంసీ 55వార్డు పరిధి జాషువానగర్ ప్రధాన గెడ్డ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు, రక్షణ గోడ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇక్కడి ప్రధాన గెడ్డ ఇరుకుగా ఉండడంతో ఎగువ ప్రాంతాల నుంచి వర్షాకాలంలో మురుగు పొంగి సమీప నివాసాల్లోకి ప్రవేశిస్తోంది. ఈ నేపథ్యంలో వర్షాలుపడిన ప్రతిసారి గెడ్డను అనుకుని ఉంటున్న ప్రజలు ఆందోళన లోనవుతున్నారు. సమస్యలను గుర్తించిన అధికారులు ఎట్టకేలకు గెడ్డకు గల బాక్స్‌ను తెరిచి కల్వర్టు, రక్షణ గోడను నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అయితే, పనులకు సంబంధించి టెండర్ వేసి దాదాపు పదినెలలు గడుస్తున్నా నెలరోజుల క్రితం పనులు ప్రారంభించారు. కల్వర్టు నిర్మాణం కోసం గెడ్డను ఆనుకుని ఉన్న రోడ్డును బ్లాక్ చేయడంతో వాహనదారులు, స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు.



జాషువానగర్‌లో గెడ్డకు నిర్మిస్తున్న కల్వర్టు

పనులజాప్యంతో స్థానిక జాషువానగర్, రెడ్డి కంచరపాలెం గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

వన్‌టౌన్ రోడ్డు విస్తరణలో జాప్యం..

» రాకపోకలకు యాతన

జగదాంబ కూడలి, ఆగస్టు 25: వన్‌టౌన్‌లో రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతోజనాలు అవస్థలు ఎదుర్కొంటు న్నారు. జగదాంబ వాచ్‌హౌస్‌నుంచి ఆంజనేయ స్వామి గుడి వరకు రోడ్డు, ఫుట్‌పాత్‌లు, కాలువలునిర్మించినా, పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డునుంచి కురుపాం మార్కెట్ వరకు ఈ పనుల్లో ఆలస్యంతో వాహనదారులు, పాదచారులు నిత్యం నరకయాతన పడుతున్నారు. మెయిన్ రోడ్డు ఆంజనేయ స్వామిగుడి నుంచి పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు, కురుపాం మార్కెట్ వద్ద విస్తరణ పనులతోపాటు జీవీఎంసీ రోడ్ల నిర్మాణం ముందుకు సాగడడం లేదు. కాలువల నిర్మాణం పూర్తికాక, టౌన్ కొత్తరోడ్డు నుంచి రోడ్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి. మెయిన్ రోడ్డు నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, కార్లు, టూవీలర్స్ గతుకు రోడ్లు, పనుల వ్యర్థాల మధ్య ప్రయాణించలేని దుస్థితి నెలకుంది. సాయంత్రం సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. మెయిన్ రోడ్డు పూర్ణామార్కెట్ నుంచి ఏవీఎన్ కాలేజీ డౌన్ మార్గం పూర్తిగా గతుకులమయం కావడం, కాలువల్లోకి నీరు సక్రమంగా వెళ్లకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీ రు చేరి చెరువును తలపిస్తోంది. వన్‌టౌన్ అభివృద్ధి పనుల్లో భాగం గా రూ. 12 కోట్లతో జీవీఎంసీ రోడ్డు విస్తరణ పనులు చేపడుతోంది.ఎన్నికల ముందు ప్రారంభించిన ఈ పనులు నేటికీ కొనసాగుతుండడం గమనార్హం. పలుచోట్ల కాలువలు, ఫుట్‌పాత్ పనులు అరకొరగా చేపడుతుండడం గమనార్హం. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీని వాస్ దృష్టిసారించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.



కురుపాం మార్కెట్ వెళ్లే దారిలో నిలిచిన వర్షం నీరు

సీపీఎం నేత పుష్పాంజలి మృతి



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంచరపాలెం, ఆగస్టు 25 : కంచరపాలెం జోన్ సీపీఎం నాయకురాలు ఎ.పుష్పాంజలి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని స్థానిక బీఎస్ఆర్ భవనం వద్ద పార్టీ నాయకులు సందర్శనార్థం ఉంచారు. ఐద్వా కంచరపాలెం జోన్ కార్యదర్శిగా పుష్పాంజలి సేవలందించారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ కార్యవర్గసభ్యులు బి.గంగారాం,ఆర్ఎస్ఎస్‌కె. కుమార్, బి.జగన్, వీఎస్.పద్మనాభరాజు తదితరులు ఆమె భౌతికకాయానికి పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె సేవలను కొనియాడారు. అనంతరం భౌతిక కాయాన్ని ఊరేగింపుగా సాగనంపారు.

డాబాగార్డెన్స్: నిరంతరం ప్రజల సంక్షేమ కోసమే లక్ష్యంగా ఆర్.పి.రాజు, పుష్పాంజలి సాహలు పనిచేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎం అక్కయ్యపాలెం జోన్ కన్వీనర్ ఆర్.పి.రాజు వర్ధంతి, కంచరపాలెం జోన్ సభ్యురాలైన పుష్పాంజలి సాహస్ర మృతికి జిల్లా కమిటీఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరు అక్కయ్యపాలెం ప్రాంత ప్రజల కోసమే కాకుండా జిల్లాలో దళితులకు రక్షణగా నిలిచారన్నారు. కంచరపాలెం జోన్ కమిటీ సభ్యులు ఒమ్మి అప్పారావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కె.ఆర్. కుమార్‌మంగళం, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, మణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ ఫోకస్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శివశంకర్ రెడ్డి, సురేష్,ప్రిన్సిపాల్ కె.వి. రమణ

కంచరపాలెం, ఆగస్టు 25 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో 'కెమికల్ హజార్డ్స్ &ఫైర్ హజార్డ్స్-కంట్రోల్ మేజర్స్ 'అనేఅంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, పారిశ్రామిక భద్రతా అధికారులు ఆర్ఎస్ఎస్ఆర్. సురేష్, ఆర్.మధు తదితరులు పాల్గొని పారిశ్రామిక భద్రత,ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలపై ఏవిదంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా అతిథులు చేతుల మీదుగా సేఫ్టీ ఫోకస్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెమికల్ కోర్సు విభాగాదిపతి డా.బీవీ లక్ష్మణరావు, సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, ఇండస్ట్రియల్ సేఫ్టీ,ఫైర్ సేఫ్టీ,కెమికల్ సేఫ్టీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు హాజరయ్యారు.

ఎంత పొడవైన పొట్లకాయలో...



పొట్లకాయలతో రైతు దేముడు

అక్కయ్యపాలెం, ఆగస్టు 25 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్‌లోని రైతుబజారులో తొమ్మిదడుగుల పొడవైన పొట్లకాయలు విక్రయానికి వచ్చాయి. కోటపాడు మండలం మర్రివలస గ్రామానికి చెందిన రైతు ఎం. దేముడు వీటిని తీసుకురావడంతో వినియోగదారులు ఆసక్తిగా తిలకించారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక రద్దు

మహారాణిపేట, ఆగస్టు 25: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కారవే దిక కార్యక్రమం రద్దు చేసినట్టు కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు, కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.జిల్లా వాసులుఈ విషయాన్నిగమనించాలని కోరారు.0

విద్యా హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలుచేయాలి

సీతమ్మధార, ఆగస్టు 25: విద్యా హక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రాథమిక విద్యను తప్పనిసరిగా మాతృభాషలోనే అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వక్తలు పేర్కొన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఏపీ రైటు టు ఎడ్యుకేషన్ ఫోరమ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక విద్య మాతృ భాషలోనే సాగాలి అనే అంశంపై ఫోరం రాష్ట్ర కన్వీనర్ నవర ప్రకాశరావు అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. నగరానికి చెందిన విద్యావేత్తలు, భాషాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యపై విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని సూచించారు. ప్రాథమిక విద్యలో నైతిక విలువలు పెంపొందించేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ సదస్సులో డాక్టర్ సత్యమూర్తి, పి.కన్నయ్య, వేదుల కామేశ్వరశర్మ, వర్రే నాంచారయ్య, మేడ మస్తాన్ రెడ్డి, హుస్సేన్, దాట్ల బాబురావు రెడ్డి, పరవస్తూ ఫణి శయన సూరి, సుజాత, బ్రాహ్మకుమారి రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

అప్పన్న ఆలయానికి తదుపరి ఈఓ ఎవరు ?

సింహాచలం, ఆగస్టు 25 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి తదుపరి ఈఓ ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత ఈఓ సింగాల శ్రీనివాసమూర్తిని గత ఏడాది సెప్టెంబరులో ఏడాది పాటు నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే నెలతో ఆయన పదవీ కాలం ముగియనుంది. విశాఖలో ఆర్‌డీఓగా పనిచేసిన శ్రీనివాసమూర్తి సెప్టెంబర్ 17, 2023న ఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో వైకుంఠ ఏకాదశి, వార్షిక తిరు కల్యాణోత్సవం, స్వామివారి నిజరూపదర్శనం చందనోత్సవం, గిరి ప్రదక్షిణ ఉత్సవాలన్నీ విజయవంతమయ్యాయి.

వార్షికోత్సవాలతో పాటు ఈఏడాది మార్చి ఆఖరి వారంలో ఐదు రోజుల పాటు సుదర్శన నారసింహ యజ్ఞాన్ని కూడా నిర్వహించి, భక్తుల మన్ననలు పొందారు. ప్రభుత్వం తనకు ఈఓగా ఇచ్చిన ఏడాది సమయం పూర్తి కావడంతో తనను మళ్లీ మాతృ సంస్థకు బదిలీ చేయాలని ఆయన ప్రభు త్వానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో దేవస్థానానికి తదుపరి ఈఓగా ఎవరిని నియమించాలన్న దానిపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. రెవెన్యూ శాఖ నుంచి నియమించేందుకు యోచిస్తున్నపటికీ ఆ శాఖకు చెందిన అధికారులెవరూ ఈఓగా వచ్చేందుకు మొగ్గు చూపడం లేదు.

ఈఓ పోస్టుకు అర్హత కలిగిన ఆర్‌జేసీ స్థాయి అధికారులు చంద్రశేఖర్ ఆజాద్, సురేష్‌బాబు, భ్రమరాంబ, త్రినాథరావు ఉన్నారు. అలాగే దేవాదాయ శాఖ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ గతంలో సింహాచలం ఈఓగా ఏడేళ్ల పాటు పనిచేసిన కొడూరి రామచంద్రమోహన్ పేరును కూడా ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

అన్నక్యాంటీన్‌కు ముస్తాబు

అక్కయ్యపాలెం, ఆగస్టు 25 : గ్రేటర్ 45వ వార్డు నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నగర్‌లోని అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. 2015లో టీడీపీ హయాంలో ఈ ప్రాం తంలో ఈ అన్నక్యాంటీన్‌ను ప్రారంభమైంది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని మూసివేశారు. అప్పటి నుంచి ఇప్పటినుంచి ఈ భవనం వృథాగా వదిలేశారు. ఇప్పుడు తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్‌ను పునః ప్రారంభించనున్నారు. దీనిలో భాగంగా ఈభవనానికి రంగులువేసి అధికారులు ముస్తాబు చేశారు.



45వ వార్డులో ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్

ఉక్కు ఉద్యోగులకు ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ నిలుపుదల

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 25: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఆర్జిత సెలవులు (ఈఎల్)ఎన్‌క్యాష్‌మెంట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులు ఇచ్చింది. 2021 నుంచి అధికారులకు 270, కార్మికులకు 170కు పైగా ఆర్జిత సెలవులుంటే ఇందులో ఏడాదికి గరిష్ఠంగా 30ఆర్జిత సెలవులను ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునే సదుపాయం గతంలో ఉండేది. పదవీ విరమణ ఉద్యోగులు ఒక నెల ముందు 30 సెలవులను ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునేందుకు వీలయ్యేది. ఇప్పుడు ఈ సదుపాయాలను నిలిపివేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మార్చి 31వరకు ఉత్తర్వులు అమల్లో ఉంటాయని యాజమాన్యం పేర్కొంది. ఇదిలాఉండగా, ఇటీవల ఉక్కు ఉద్యోగులకు అనేక అంశాల్లో కోతలు విధిస్తున్న యాజమాన్య తాజాగా ఈఎల్ విషయంలో ఉత్తర్వులు ఇవ్వటంతో ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

దొండపర్తిలో పారిశుధ్య లోపం



గ్రంథాలయం సమీపంలో దర్శనమిస్తున్న చెత్త కుప్ప

అక్కయ్యపాలెం, ఆగస్టు 25 : గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య లోపం నెలకొంది. రహదారులపై చెత్తకుప్పలు పేరుకుపోవడంతో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చెత్త కుప్పల వల్ల వ్యాధులతో పాటు వివిధ రకాల జ్వరాలు విజృంభించే అవకాశం ఉంది. ఏ రోజుకు ఆ రోజు పారిశుధ్య కార్మికులు చెత్త కుప్పలు తొలగించకుండా వదిలేస్తున్నారు. దీని వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. అధికారులు స్పందించి దొండపర్తి, నెహ్రూబజారు, గ్రంథాలయం తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలు తొలగించి పారిశుధ్య కల్పనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టెండర్లలో మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి


వేస్తున్నారని మిగిలినవారు ప్రశ్నిస్తున్నారు. అంచనాలు తయారుచేయడంలోనే లోపం ఉందా? లేదంటనే పనులు చేయకుండానే కనికట్టు చేస్తున్నారా? అనేది అధికారే స్పష్టంచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలపై జీవీఎంసీ కమిషనర్ దృష్టిసారించకపోతే భవిష్యత్తులో నగరంలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత 'ఎండమావిగా' మారడం ఖాయమంటున్నారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ సెంటర్

... 5వ పేజీ తరువాయి

గగనమవుతుండడంతో బాధితులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తు న్నారు. ఈ తరహా ఇబ్బందులకు చెక్‌పెట్టేలా సీబీఆర్ఎన్ సెంటర్ ఉపకరిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎల్‌జీ పాలిమర్స్ వంటి ఘటనలు జరిగినప్పుడు సెకండరీ లెవెల్ కెమికల్ విభాగంలో ఉండే వైద్య సిబ్బంది సేవలు అంది స్తారు. గ్యాస్ పేలుడు, కొవిడ్ వంటి వైరస్‌లు వ్యాప్తి చెందిన ప్పుడు బయోలాజికల్ విభాగానికి చెందిన వైద్య బృందం, పరిశ్రమల్లో రేడియేషన్‌కు సంబంధించిన పదార్థాల పేలుడు జరిగినప్పుడు ఆ విభాగ సిబ్బంది అందుబాటులో ఉండి బాధితులకు మెరుగైన వైద్యం అందించనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం విమ్స్‌లో పనిచేసే వైద్య సిబ్బందికి అడ్వా న్స్‌డ్ శిక్షణ అందిస్తారు. పరిశ్రమల్లో, నేవీ, ఆర్మీడిపార్ట్‌మెం ట్ల వద్ద న్యూ క్లియర్ పదార్థాలుంటాయి. పొరపాటున, లేదా ప్రమాదవశాత్తు పేలుడు జరిగినా, లీక్ అయినా తక్షణ వైద్యసాయం అందించేందుకు ప్రత్యేకంగా న్యూక్లియర్ బ్లాక్ ను ఏర్పాటుచేస్తారు. ఈ విభాగాల్లో పనిచేసే వైద్య సిబ్బం దికి కేంద్ర ప్రభుత్వమే జీత, భత్యాలను చెల్లించనుంది.

తుది తనిఖీలతో గ్రీన్‌సిగ్నల్



ఇటీవల సంభవించిన ప్రమాదాల్లో బాధితులకు వైద్య సేవలు అందించడంలో యంత్రాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. సీబీఆర్ఎన్ సెంటర్ అందుబాటులోకి వస్తే అడ్వాన్స్‌డ్ వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర బృందం తనిఖీలు నిర్వహించి, తుది అనుమతులు ఇవ్వనుంది. భవన నిర్మాణానికి సంబంధించిన డిజైన్ సిద్ధమైంది. కేంద్ర బృందం పర్యటన తరువాత పను లు ప్రారంభం కానున్నాయి. భవన నిర్మాణానికి కేటాయిం చిన స్థలం, సిబ్బంది నియామకం వంటి అంశాలపై కేంద్ర బృందంతో చర్చిస్తాం.

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

నీటి వనరుల పరిరక్షణపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

క్రమేణా తగ్గిపోవడంతో పాటు ముసురు వాతావరణం కనిపించడం లేదు. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గాలిలో తేమశాతం పెరుగుతోంది. నగర విస్తరణలో భాగంగా అనేకచోట్ల నీటి వనరులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ప్రస్తుతం జీవీఎంసీ విస్తీర్ణం 681 చదరపు కిలోమీటర్లు. ఉపాధి నిమిత్తం నగరానికి వలసలు పెరగడంతో ఏర్పడిన మురికివాడలు, పరిశ్రమలు, వాహనాల కాలుష్యం పరిధికి మించుతోంది.

నాడు 179 తాగునీటి వనరులు

సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన టోప్ షీట్ ఆధారంగా నగరంలో జీవీఎంసీ అధికారులు 215 నీటి వనరులున్నట్టు గుర్తించారు. పట్టణీకరణతో జీవీఎంసీ జోన్ 3,4,5లో ఒక్క చెరువు కూడాలేదు. జోన్-1లో 22 నీటివనరులు, జోన్ 2లో 15, జోన్-6లో 100, జోన్-7లో తొమ్మిది, జోన్-8లో 28 నీటివనరులు (చెరువులు) ఉన్నాయి. సింహాచలం దేవస్థానం పరిధిలో రెండు చెరువులు, 15 నీటి ధారలు ఉండగా, నగర శివారుల్లో 90 శాతం చెరువుల కింద సాగు చేయడంలేదు. నగరం బౌల్ ఏరియాలో ఉండడంతో వర్షం నీటిలో మూడు నుంచి ఐదుశాతం మాత్రమే భూమిలోకి ఇంకుతుండగా మిగిలిన నీరు సముద్రంలో కలుస్తోంది.

ఇక నగరంలో చెరువులు, గెడ్డలు అంతరించిపోగా శివారు ప్రాంతాల్లో చెరువులకు వర్షం నీరు వచ్చే కాలువలు మూసివేశారు. గొలుసుకట్టు చెరువులు ప్రమాదంలో పడ్డాయి. ఆటోనగర్, కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో చెరువులు మురికికూపాల్లా మారిపోయాయి. ఎండాడ జంక్షన్‌లో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చెరువుకు కొండ నుంచి వచ్చే వరదనీటి ప్రవాహాలను మూసివేశారు. మధురవాడజాతర సమీప చెరువు ఆక్రమించేశారు. మారికవలస, రుషికొండ ప్రాంతాల్లో వాగులు, గెడ్డలు పూడ్చి వేశారు. నగరంలో నీటి వనరుల వినియోగం పెరగడం, సహజ నీటి వనరులు ఉనికి కోల్పోవడంతో ఇక్కట్లు మొదలయ్యాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది.

తొలుత మూడు అంశాలపై ఫోకస్

నగరంలో సహజ నీటి వనరులను కాపాడుకోవాలన్న ప్రతిపాదనలపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో ధ్యాన్ ఫౌండేషన్ ప్రతినిధులు చర్చించారు. తరువాత కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆధ్వర్యంలో పలు విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చేనెలాఖరులోగా నగరం పరిసరాల్లో చెరువులు, నీటి వనరులను గుర్తించి, ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూశాఖకు కలెక్టర్ ఆదేశించారు. వచ్చేనెల 15లోగా చెరువులు, గెడ్డల్లో పూడిక తీసివేత, మురుగునీరు, చెత్తా, చెదారం తొలగింపు, మదుములు, కల్వర్టుల పునరుద్ధరణపై నివేదిక ఇవ్వాలని జీవీఎంసీ, ఇరిగేషన్, డ్వామా, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించారు. ఆ నివేదికలను పరిగణనలోనికి తీసుకుని మూడు అంశాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెడతారు.

నరవ ప్రాంతంలో పది గొలుసుకట్టు చెరువులు, కాపులుప్పాడ ఏరియాలో ఎనిమిది, పెందుర్తి సమీప రాంపురంప్రాంతంలో చెరువులు పునరుద్ధరిస్తారు. పైనుంచి వర్షం నీరు వచ్చేలా వాగులకు మరమ్మతులు చేస్తారు. ఒక చెరువు నుంచి మరో చెరువుకు నీటి ప్రవాహం దారుల్లో అడ్డంకులు తొలగిస్తారు. మదుములు, కల్వర్టులు బాగుచేస్తారు. రెండోది... ఆటోనగర్, కొత్తపాలెంలోని రెండు చెరువుల్లో మురుగు నీరు, పూడిక తొలగిస్తారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటిని ఈ రెండు చెరువులకు పంపుతారు. అక్కడ సహజసిద్ధంగా నీరు శుద్ధి అయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. ఇక సీతమ్మధార నుంచి మాధవధార, సింహాచలంవైపుగా మొత్తం 15 జల ధారలున్నాయి. ఇవి ఏడాది పొడవునా ప్రవహిస్తుంటాయి. వీటిని కాపాడుకోవాలంటే... కొండలపై చెక్ డ్యామ్‌లు, కాంటార్లు ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. మూడు అంశాలకు డ్వామా, జీవీఎంసీలో డ్వాక్రా సంఘాల సేవలు తీసుకుంటారు. సర్వే పూర్తైన తరువాత పనులు చేపడతారు. వచ్చే ఏడాది మే నెలాఖరునాటికి సహజ వనరుల పునరుద్ధరణ పూర్తిచేయాలని లక్ష్యంగా ప్రణాళిక అమలుచేయనున్నారు.

నేరాలకు అడ్డాగా పెందుర్తి!

పెందుర్తి కూడలి



నానాటికీ అధికమవుతున్న చోరీలు, గంజాయి రవాణా, భూ దందాలు, చిట్‌లు, ఉద్యోగాల పేరిట టోకరా వంటి ఘటనలు

భయాందోళనకు గురవుతున్న ప్రజలు

పెందుర్తి, ఆగస్టు 25: విశాఖ నగరంలో ఎటువంటి నేరాలు జరిగినా మూలాలు పెందుర్తిలోనే కనిపిస్తుండడం కలవర పెడుతుంది. గంజాయి రవాణా, భూ దందా, చిట్‌ల టోకరా, నకిలీ పోలీసుల దందా, ఉద్యోగాల పేరిట టోకరా, పేకాట శిబిరాలు, కిడ్నీల రాకెట్, ఏటీఎంల చోరీ, దోపిడీ దొంగల హల్‌చల్.. ఇలా అన్ని నేరాలకు పెందుర్తి అడ్డాగా మారుతుంది. రెండు దశాబ్దాల క్రితం పంచాయతీగా ఉన్న పెందుర్తి 2006లో జీవీఎంసీలో విలీనమైంది. స్థిరాస్తి, ఇతర వ్యాపార కలాపాలకు ఈ ప్రాంతం కేంద్రీకృతం కావడంతో జనసాంద్రత పెరిగింది. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి అనేకమంది ఇక్కడకు వలస వచ్చి స్థిరపడ్డంతో క్రైమ్ రేటు అధికమైంది.

గంజాయి కేరాఫ్‌గా..

పెందుర్తిలో గడిచిన ఆరు నెలల కాలంలో సుమారు వెయ్యి కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడిందంటే ఈ రవాణా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసుల కళ్లుగప్పి వేల కిలోల గంజాయి పెందుర్తి కేంద్రంగా ఇతర ప్రాంతాలకు రవాణా అవుతుందని ఆ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు.

దొంగల హల్‌చల్

మాస్కులు ధరించి కార్లలో దర్జా తిరుగుతూ దొంగలు తాళాలు బద్దలుగొట్టి చోరీలకు పాల్పడుతున్న సంఘటనలు ఇటీవల పెందుర్తిలో చోటుచేసుకున్నాయి. పెందుర్తి, వేపగుంట, చినముషిడివాడ, వేపగుంట అపార్ట్‌మెంట్లలో గల తాళం వేసిన ఫ్లాట్లలో వరుస చోరీలు జరిగాయి. ఇందులో పెందుర్తిలోని అపార్ట్‌మెంటులోని ఓ ఫ్లాట్‌కు కారులో దర్జాగా వచ్చి మాస్క్ ధరించిన అగంతకుడు భారీగా నగదు బంగారం చోరీ చేశాడు. అంతకు ముందు జరిగిన చోరీల్లో ముసుగులు ధరించిన నలుగురు అగంతకులు అపార్ట్‌మెంట్లలోకి ప్రవేశించి దోపిడీకి పాల్పడినట్టు సీసీ టీవీల ఫుటేజీలో రికార్డు అయ్యాయి, అలాగే తాళం వేసి ఉన్న మూడిళ్లల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. కాగా పెందుర్తిలో మూడు రోజుల క్రితం ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి కార్లలో వచ్చిన దొంగలు ముసుగు, గ్లౌజులు ధరించి ఆధునిక పరికరాలతో చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీ అంతరాష్ట్ర దొంగలు ముఠా పనేనని పోలీసులు భావిస్తున్నారు. పెందుర్తిలోని జాతీయ రహదారిపైనా దోపిడీలు జరిగాయి,



చోరీకి గురైన ఏటీఎం..(ఫైల్)



దొంగతనం జరిగిన ఇల్లు (ఫైల్)

చిట్‌లు, ఉద్యోగాల పేరిట టోకరా..

చోరీలు సంగతి పక్కన పెడితే.. చిట్‌లు, ఉద్యోగాల పేరిట టోకరాకు సంబంధించిన కేసులు కూడా పెందుర్తిలో అధికంగానే నమోదవుతున్నాయి. ఏడాది కాలంలో పెందుర్తిలో చిట్‌ల రూ.15 కోట్లకు నిర్వాహకులు టోకరా వేశారంటూ పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. అలాగే ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల తల్లిదండ్రుల నుంచి ఓ నకిలీ ఎస్‌ఐ రూ.కోట్లలో వసూలు చేశాడు. తాను నగరంలోని టూ టౌన్ ఎస్‌ఐగా పని చేస్తున్నానని చెప్పుకుంటూ పెందుర్తిలో ఉంటున్న ఓ నకిలీ ఎస్‌ఐ రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి తప్పుడు పత్రాలతో కంపెనీ పెట్టి నిరుద్యోగుల తల్లిదండ్రుల నుంచి రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడిన సంగతి తెలిసిందే. మరోపక్క రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ కేసు పెందుర్తిలోని ఓ ఆస్పత్రి కి సంబంధించే నమోదైంది. ఈ కేసుకు సంబంధించి ఓ డాక్టర్ కూడా అరెస్టు అయ్యాడు. ఇక భూ ఆక్రమణలు, నకిలీ పట్టాలు, తప్పుడు పత్రాలతో భూ దందాలతో పాటు పేకాట శిబిరాలు, తదితర నేరాలకు సంబంధించిన కేసులు పెందుర్తిలో ఎక్కువగా నమోదువుతున్నాయి.

పెందుర్తి పరిధి విశాలం.. ఒక్కటే పోలీస్ స్టేషన్

పెందుర్తి పోలీసు స్టేషన్ పరిధి విశాలమైనది. సుమారు రెండు లక్షల మంది జనాభాకు ఒక్కటే పోలీస్ స్టేషన్ కావడంతో క్రైమ్ నియంత్రణ సాధ్యం కావడం లేదు. నరవలో అవుట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదన, జెర్రిపోతులపాలెం, చింతగట్ల శివారు గ్రామాలను సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో విలీనం చేస్తారన్నది కార్యరూపం దాల్చడం లేదు. మరోపక్క పెందుర్తి నేర విభాగ స్టేషన్‌లో క్రైమ్ ఎస్‌ఐ ఒకరే కావడం, సిబ్బంది కొరత వెంటాడుతుంది. కాగా ఇక్కడ సీఐ పోస్టును తప్పించి జోన్‌గా గుర్తిస్తూ కంచరపాలెం సర్కిల్ పరిధిలో దీనిని (పెందుర్తి పోలీస్ క్రైమ్ స్టేషన్‌ను) చేర్చారు. దీంతో ఇది జోనల్ స్టేషన్ కావడంతో అక్కడి క్రైమ్ సీఐ ఇక్కడి పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు పెందుర్తిలో నేరాల తగ్గుముఖం పట్టేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

పంచాయతీలకు పూర్వ వైభవం

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఆగస్టు 25: రాష్ట్రంలో పంచాయతీలకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలనే బలమైన సంకల్పంతో ఏక కాలంలో 13,326 పంచాయతీల్లో ఉపాధి గ్రామ సభలు నిర్వహించి జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాజకీయ వ్యవస్థకు మార్గదర్శి అయ్యారని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. జాతీయ స్థాయిలో పవన్‌కల్యాణ్‌కు ప్రశంసలు లభించిన ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ సుజాతనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పంచకర్ల విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలన్నీ ఆర్థికాభివృద్ధి, స్వయం సమృద్ధి సాధించేందుకు పటిష్ఠమైన ప్రణాళికను గ్రామస్థులే రూపొందించుకోవాలన్న ఉద్దేశంతో పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి పవన్ కృషి చేస్తున్నారన్నారు. పవన్ సరళీకృత విధానాల వల్ల ఉపాధి నిధులతో రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఉపాధి గ్రామ సభలు విజయవంతం అయ్యాయని పంచకర్ల పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సింహాచలంనాయుడు, బలిరెడ్డి అప్పారావు, గొర్లె రామునాయుడు, వనం సత్యనారాయణ పాల్గొన్నారు

పారిశ్రామిక ప్రాంత సమస్యలను పరిష్కరిస్తా..

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, ఆగస్టు 25: పారిశ్రామిక ప్రాంతంలో నెలకొన్న సమస్యలను స్థానిక నాయకుల ద్వారా గుర్తించి పరిష్కరించడం జరుగుతుందని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. శ్రీహరిపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తనను పారిశ్రామిక ప్రాంత ప్రజలు వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారికి ఎంతో రుణపడి ఉన్నానన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని పలు సమస్యలను గుర్తించడం జరిగిందని, వాటిని దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు నక్కాలక్ష్మణరావు, టీడీపీ నాయకుడు పొత్తబత్తుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో పిచ్చికుక్క స్వైరవిహారం

మూడేళ్ల బాలికకు తీవ్ర గాయాలు

పెందుర్తి, ఆగస్టు 25: ఇక్కడి బీసీ కాలనీ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని వీరభద్రనగర్‌లో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఇప్పటికే పలువురిని గాయపరిచిన ఈ కుక్క ఆదివారం ఆరుబయట ఆడుకుంటున్న మూడేళ్ల బాలిక ఖతీజా సుల్తానాకు మెడ, మోచేతిపై కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. తక్షణమే కుటుంబ సభ్యులు చిన్నారికి వైద్య చికిత్స చేయించారు. కాగా కొద్దిరోజులుగా పిచ్చికుక్క ఈ ప్రాంతంలో కనిపించిన వారి వెంటపడుతూ గాయపరుస్తుందని, దీంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల జీవీఎంసీ సిబ్బంది స్పందించి పిచ్చికుక్కను పట్టుకోవాలని వారు కోరుతున్నారు.



బాలిక మెడకు సమీపంలో గాయాలు

'ఉక్కు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 25: స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డీవీఆర్ యూనియన్ అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరాం కోరారు. పదోన్నతుల కోసం చాలామంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని, అందువల్ల యాజమాన్యం స్పందించి పదోన్నతులు కల్పించాలన్నారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ప్రశంసాపత్రం అందజేత

కూర్మన్నపాలెం, ఆగస్టు 25: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను టీడీపీ యాప్ ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లి, సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసినందుకు గాను వడ్లపూడికి చెందిన టీడీపీ కార్యకర్త మాటూరి రాముకు మంత్రి నారా లోకేశ్ ప్రశంసాపత్రాన్ని పంపారు. ఈ మేరకు శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్‌ల చేతుల మీదుగా రాము ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.



గండి బాబ్జీ చేతుల మీదగా ప్రశంసాప్రతం అందుకుంటున్న రాము

'బీజేపీ సభ్యత్వ నమోదును సజావుగా చేయాలి'

కూర్మన్నపాలెం, ఆగస్టు 25: ప్రజా సంక్షేమం కోసం బీజేపీని ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయడంతో పాటు బీజేపీ సభ్యత్వ నమోదును సజావుగా పూర్తి చేయాలని పార్టీ గాజువాక నియోజకవర్గ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. 87వ వార్డు వడ్లపూడిలో ఆదివారం కో-కన్వీనర్ లక్కరాజు సోంబాబు ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబరు ఒకటిన ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తారన్నారు. గాజువాకలో 20 వేలకు పైగా సభ్యత్వ నమోదు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వెంకటరావు, సురేశ్, సంజీవరావు, అప్పారావు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

నడక మైదానం వద్ద మధుమేహ పరీక్షలు

అగనంపూడి, ఆగస్టు 25: స్థానిక వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడక మైదానం వద్ద ఆదివారం ఉచిత మధుమేహ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.నరసింగరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు వందమందికి ఉచితంగా టెస్టులు చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గొల్లవిల్లి కనకభవానీ, సత్యనారాయణ, రంగారావు, డొక్కా రమేశ్, ఇంద్రాదేవి, మురళీధరన్, జగదీశ్, కరణం పైడిరాజు, రామారావు, చిన్ని పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



క్షతగాత్రునితో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

క్షతగాత్రులను పరామర్శించిన కరణంరెడ్డి

కూర్మన్నపాలెం, ఆగస్టు 25: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి పవన్‌సాయి ఆస్పత్రిలో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆదివారం బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పరామర్శించారు. ఆయన వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులందరూ ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందనీ భరోసా ఇచ్చారు. నాయకులు లక్కరాజు రాంబాబు, సురేశ్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి మంచి స్పందన

పెందుర్తి, ఆగస్టు 25: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఎస్‌ఆర్‌పురంలో సర్పంచ్ దూది విజయలక్ష్మి, వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. జనసేన నాయకుడు వెంకటరమణ ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదాతలు ప్రాణదాతలతో సమానమన్నారు. 42 మంది జనసైనికులు రక్తదానం చేయగా, వారికి వెంకటరమణ సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు.

మట్టి గణపతులను పూజించాలని ర్యాలీ

కూర్మన్నపాలెం, ఆగస్టు 25: మట్టి విగ్రహాలను పూజించండి-పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ చిన్నారులు ర్యాలీ చేపట్టారు. 87వ వార్డు తిరుమల నగర్‌లో ఆదివారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ నినాదాలు చేశారు. అందరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అసోసియేషన్ నాయకులు విశ్వేశ్వరరావు, నాగభూషణం, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

ఉక్కు పరిరక్షణకు కేంద్రంపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలి

పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 25: స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు కేంద్రం చేయూతనిచ్చేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,291వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంటును మూసివేసేందుకు పలు ఆంక్షలను అధికారులతో అమలు చేయించి లాభాల్లో ఉన్న సంస్థను రూ.ఐదు వేల కోట్లకు పైగా నష్టాల వైపు నెట్టాలని చూస్తుందని ఆరోపించారు. వేలాది మంది కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసి, సమయానికి జీతాలివ్వలేని దుస్థితికి కర్మాగారాన్ని దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత గనులు కేటాయించాలని ఇటీవల ప్లాంటుకు విచ్చేసిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి వివరించామన్నారు. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, లేకుంటే సెయిల్‌లో విలీనం చేస్తామనని కేంద్రం ప్రకటించేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 27న సీఎం చంద్రబాబునాయుడుతో ఉక్కు యాజమాన్యం అమరావతిలో సమావేశం కానున్నదన్నారు. ఉక్కు పరిరక్షణకు చంద్రబాబు ఏం చేస్తారోనని అందరం ఆశగా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఉక్కు పరిరక్షణే మా లక్ష్యం

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి పోరాటాలకైనా తాము సిద్ధమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. ప్లాంట్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఉక్కు యాజమాన్యంపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి సింహాద్రి, అప్పారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

పెందుర్తి-రూరల్, ఆగస్టు 24: గ్రేటర్ 95వ వార్డు పరిధి పురుషోత్తపురం, లక్ష్మీపురం గవరపాలెం కాలనీలోని శ్రీగీతాకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీకృష్ణున్ని దర్శించుకున్నారు. పలువురు హనుమాన్ చాలీసాను పఠించడంతో పాటు భజన, భక్తి గీతాలను ఆలపించారు. సోమవారం కూడా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.

శ్రీనగర్‌లో..

శ్రీనగర్: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లోని శ్రీకృష్ణుని ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ప్రధాన అర్చకులు భూషణశర్మ పర్యవేక్షణలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ నెల 27న 108 రకాల పిండివంటలతో సంబరాలు జరుపనున్నట్టు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఆవాల సూర్యనారాయణ,ప్రధాన కార్యదర్శి కరేటి సహదేవరావు తెలిపారు.

విజ్ఞాన్ కళాశాలలో..

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఉట్టికొట్టే పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ జె.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



'విజ్ఞాన్'లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

విద్యార్థులు సంప్రదాయాలను అలవరుచుకోవాలి

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు

విశాఖపట్నం, ఆగస్టు 25: విద్యార్థులు దేశ, రాష్ట్ర సంప్రదాయాలను అలవరుచుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచించారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో భరతనాట్య కళాంజలి అధ్యక్షుడు గురువు సంతోషివిజయ్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులతో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన వివిధ భరతనాట్య ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన కన్నం వెంకటరమణారావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి నాట్యం నేర్చుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు నాట్యాన్ని పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరిరామమూర్తి మాట్లాడుతూ భరతనాట్యాంజలి గత పదేళ్లుగా అనేక మంది విద్యార్థులను భరతనాట్య కళాకారులుగా తీర్చిదిద్దడం సంతోషకరమన్నారు. అనంతరం నిర్వహించిన కూచిపూడి కళాప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాక్షేత్ర ప్రొఫెసర్ వసుంధర థామస్, సిద్ధయోగి కళా నిలయం ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.వి.సత్యభాను దితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు. (ఇన్‌సెట్లో) జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హరి వెంకటకుమారి

ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించాలని 'పల్లా'కు వినతి



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అగనంపూడి, ఆగస్టు 25: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అండమాన్ కొండయ్యవలసలోని బంగారమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు స్థానికులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఆలయ నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయని, అందువల్ల నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలని వేడుకున్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు గ్రామస్థులు తెలిపారు. పల్లాను కలిసిన వారిలో జనసేన వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్, నాయకులు పి.వసంతరావు, తిలక్, బలిరెడ్డి అప్పారావు, జనార్దనరావు, రాజు, లోకేశ్, తదితరులు ఉన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 47, టమాటా 27, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 22, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 32, దొండకాయలు 26, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 40, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 40, కీరదోస 30, క్యాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 72, కొండ ఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ 8లో..

రహదారులపైనే వారపు సంతలు: ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గాజువాక, ఆగస్టు 25: గాజువాక నియోజకవర్గంలో పలు వార్డుల్లో వారపు సంతలు రహదారులపైనే నిర్వహిస్తుండడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ వారపు సంతలు నిర్వహిస్తున్నారు. అయితే సంతల నిర్వహణ ప్రారంభ దశలో రోడ్లపై నిర్వహించినా అప్పట్లో ఇబ్బందులు ఎదరయ్యేవి కావు. కాలక్రమేణా అన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు భారీగా పెరగడం, జనసందోహం అధికం కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా చిన్న చిన్న రోడ్లపైనే వారపు సంతలు నిర్వహిస్తుండడం వల్ల ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారపు సంత రోజున ఆయా ప్రాంతాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ప్రజల సౌకర్యార్థం వారపు సంతల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా స్థలాలు కేటాయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనివల్ల ప్రజలకు, వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



డ్రైవర్స్ కాలనీలో రోడ్డులో కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

మనసును హత్తుకునే సామాజిక అంశాల కథలు

గ్రంథాలయాధికారి పీవీ రమణ

పెదగంట్యాడ, ఆగస్టు 25: సామాజిక అంశాలు ఇతివృత్తంగా ఉండే కథలు పాఠకుల మనసులను హత్తుకుంటాయని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అభిప్రాయపడ్డారు. చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కథలు రాసేందుకు అవసరమైన అంశాలను వివరించారు. ప్రస్తుతం మన మధ్య జరుగుతున్న సాంఘిక, ఆర్థిక, జీవనసరళి వంటి అంశాలతో పాఠకులకు చైతన్యాన్ని కలిగించేలా కథలు రాసేందుకు ప్రయత్నం చేయాలని విద్యార్థులకు సూచించారు. పరవస్తు చిన్నయసూరి రాసిన నీతిచంద్రిక లోని మిత్రలాభం, మిత్రబేధం లలోని కథలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కథలు రాసేందుకు సరళమైన తెలుగు భాషను వినియోగించడం మంచిదన్నారు. అనంతరం పిల్లలకు కథలు చదివించి వాటిని అనుకరించి కథలు రాయాలని సూచించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను అందిస్తున్న సీనియర్ పాత్రికేయుడు ఆదారి కొండలరావు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిధి అల్లిపురంలోని గ్రంథాలయానికి సీనియర్ జర్నలిస్ట్ ఆడారి కొండలరావు రూ. 20 వేల విలువైన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాహిత్య గ్రంథాలతోపాటు జర్నలిజానికి సంబంధించిన పుస్తకాలను ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలని అన్నారు. గ్రంథాలయాల పఠనం వల్ల విజ్ఞానం పెంపొందుతున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు ఇంతగా పురోభివృద్ధి సాధించడం వెనుక పుస్తక పఠనం ఎంతో ఉంటుందన్నారు. సృజనాత్మకకు సాహిత్య పుస్తకాలు తోడ్పడతాయన్నారు. యువత పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటగౌరీ సంఘం ప్రతినిధులు, గ్రంథాలయ పాలకవర్గం పెద్దలు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ కోచ్‌గా మురళీకృష్ణ



మురళీకృష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 25: పారిస్ జరిగే పారా ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత బ్యాడ్మింటన్ జట్టు కోచ్‌గా నగరానికి చెందిన ఇంటర్నేషనల్ షట్లర్, లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ ఎంవీ.మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు ఆదివారం తన కార్యాలయంలో మురళీకృష్ణను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్ఠాత్మక పారా ఒలింపిక్స్‌కు భారత్ బ్యాడ్మింటన్ కోచ్‌గా మురళీకృష్ణ నియమితులు కావడం నగర క్రీడారంగానికి గర్వకారణమన్నారు. ఈనెల 28 నుంచి జరిగే పారా ఒలింపిక్స్‌లో భారత షట్లర్లు దేశానికి పతకాలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

మురళీనగర్, ఆగస్టు 25 ; గ్రేటరు 50వవార్డు మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఐ ఫౌండేషన్ నుంచి వచ్చిన వైద్యులు బి.సమృద్ధి, ఆర్. దేశ్‌ముఖ్ రోగులకు తనిఖీల నిర్వహించారు. కళ్ల రక్షణపై పలు సూచనలు చేశారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ వాడకంలో కంటికి తగిన విశ్రాంతి ఇస్తు వినియోగించాలన్నారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శిబిరంలో వసతులు కల్పించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



నిరసన తెపుతున్న కార్మికులు, ఏఐటీయూ నాయకులు

సీతమ్మధార, ఆగస్టు 25: ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఏఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విశాఖలో జరుగనున్న ఏఐటీయూసీ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ సీతమ్మధార కేఆర్ఎం కాలనీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ,ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 3వ తేదీన విశాఖ సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ బొమ్మ వరకు జరుగు మహాప్రదర్శనలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావి కృష్ణ, కె.మోహన్. పి.రాము, ఆర్. జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవ పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 25: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికారం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి క్రీడా పోటీలతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నాయని సంస్థ క్రీడాధికారి జూన్ గ్యాలియట్ ఒక ప్రకటనలో తెలిపారు. రేస్ వాక్, వాలీబాల్, హాకీ (పెనాల్టీ షూటౌట్స్), 5ఏ సైడ్ ఫుట్బాల్ (మినీ ఫుట్‌బాల్), టెన్నిస్ బాల్ క్రికెట్, బ్యాడ్మింటన్, చెస్, 3ఏ సైడ్ బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, ఖోఖో, రోప్ జంపింగ్‌తోపాటు లెమన్ రేస్, లగోరి లంగడి, ప్లాంక్ చాలెంజ్ క్రీడాంశాలలో పోటీలుంటాయని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి ఈనెల 29న జరిగే జాతీయ క్రీడా దినోత్సవం రోజున బహుమతులందిస్తామన్నారు. అలాగే, జాతీయ, అంతర్జాతీయ, జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను సన్మానిస్తామన్నారు.

నత్తనడక పనులతో అవస్థలు

▸▸ **జాషువానగర్‌లో నెలల తరబడి నిర్మాణం**

కంచరపాలెం, ఆగస్టు 25 : జీవీఎంసీ 55వార్డు పరిధి జాషువానగర్ ప్రధాన గెడ్డ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు, రక్షణ గోడ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇక్కడి ప్రధాన గెడ్డ ఇరుకుగా ఉండడంతో ఎగువ ప్రాంతాల నుంచి వర్షాకాలంలో మురుగు పొంగి సమీప నివాసాల్లోకి ప్రవేశిస్తోంది. ఈ నేపథ్యంలో వర్షాలుపడిన ప్రతిసారి గెడ్డను ఆనుకుని ఉంటున్న ప్రజలు ఆందోళన లోనవుతున్నారు. సమస్యలను గుర్తించిన అధికారులు ఎట్టకేలకు గెడ్డకు గల బాక్స్‌ను తెరిచి కల్వర్టు, రక్షణ గోడను నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అయితే, పనులకు సంబంధించి టెండర్ వేసి దాదాపు పదినెలలు గడుస్తున్నా నెలరోజుల క్రితం పనులు ప్రారంభించారు. కల్వర్టు నిర్మాణం కోసం గెడ్డను ఆనుకుని ఉన్న రోడ్డును బ్లాక్ చేయడంతో వాహనదారులు, స్థానికులు సమస్యలు ఎదుర్కొంటున్నారు.



జాషువానగర్‌లో గెడ్డకు నిర్మిస్తున్న కల్వర్టు

పనులజాప్యంతో స్థానిక జాషువానగర్, రెడ్డి కంచరపాలెం గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

వన్‌టౌన్ రోడ్డు విస్తరణలో జాప్యం..

▸▸ **రాకపోకలకు యాతన**

జగదాంబ కూడలి, ఆగస్టు 25: వన్‌టౌన్‌లో రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతోజనాలు అవస్థలు ఎదుర్కొంటు న్నారు. జగదాంబ వాచ్‌హౌస్‌నుంచి ఆంజనేయ స్వామి గుడి వరకు రోడ్లు, ఫుట్‌పాత్‌లు, కాలువలునిర్మించినా, పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డునుంచి కురుపాం మార్కెట్ వరకు ఈ పనుల్లో ఆలస్యంతో వాహనదారులు, పాదచారులు నిత్యం నరకయాతన పడుతున్నారు. మెయిన్ రోడ్డు ఆంజనేయ స్వామిగుడి నుంచి పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు, కురుపాం మార్కెట్ వద్ద విస్తరణ పనులతోపాటు జీవీఎంసీ రోడ్ల నిర్మాణం ముందుకు సాగడడం లేదు. కాలువల నిర్మాణం పూర్తికాక, టౌన్ కొత్తరోడ్డు నుంచి రోడ్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి. మెయిన్ రోడ్డు నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, కార్లు, టూవీలర్స్ గతుకు రోడ్లు, పనుల వ్యర్థాల మధ్య ప్రయాణించలేని దుస్థితి నెలకుంది. సాయంత్రం సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. మెయిన్ రోడ్డు పూర్ణామార్కెట్ నుంచి ఏవీఎన్ కాలేజీ డౌన్ మార్గం పూర్తిగా గతుకులమయం కావడం, కాలువల్లోకి నీరు సక్రమంగా వెళ్లకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీ రు చేరి చెరువును తలపిస్తోంది. వన్‌టౌన్ అభివృద్ధి పనుల్లో భాగం గా రూ. 12 కోట్లతో జీవీఎంసీ రోడ్డు విస్తరణ పనులు చేపడుతోంది.ఎన్నికల ముందు ప్రారంభించిన ఈ పనులు నేటికీ కొనసాగుతుండడం గమనార్హం. పలుచోట్ల కాలువలు, ఫుట్‌పాత్ పనులు అరకొరగా చేపడుతుండడం గమనార్హం. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీని వాస్ దృష్టిసారించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.



కురుపాం మార్కెట్ వెళ్లే దారిలో నిలిచిన వర్షం నీరు

సీపీఎం నేత పుష్పాంజలి మృతి



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంచరపాలెం, ఆగస్టు 25 : కంచరపాలెం జోన్ సీపీఎం నాయకురాలు ఎ.పుష్పాంజలి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని స్థానిక బీఎస్ఆర్ భవనం వద్ద పార్టీ నాయకులు సందర్శనార్థం ఉంచారు. ఐద్వా కంచరపాలెం జోన్ కార్యదర్శిగా పుష్పాంజలి సేవలందించారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ కార్యవర్గసభ్యులు బి.గంగారాం,ఆర్ఎస్ఎస్‌కె. కుమార్, బి.జగన్, వీఎస్.పద్మనాభరాజు తదితరులు ఆమె భౌతికకాయానికి పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె సేవలను కొనియాడారు. అనంతరం భౌతిక కాయాన్ని ఊరేగింపుగా సాగనంపారు.

డాబాగార్డెన్స్: నిరంతరం ప్రజల సంక్షేమ కోసమే లక్ష్యంగా ఆర్.పి.రాజు, పుష్పాంజలి సాహులు పనిచేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎం అక్కయ్యపాలెం జోన్ కన్వీనర్ ఆర్.పి.రాజు వర్థంతి, కంచరపాలెం జోన్ సభ్యురాలైన పుష్పాంజలి సాహస్త్ర మృతికి జిల్లా కమిటీఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరు అక్కయ్యపాలెం ప్రాంత ప్రజల కోసమే కాకుండా జిల్లాలో దళితులకు రక్షణగా నిలిచారన్నారు. కంచరపాలెం జోన్ కమిటీ సభ్యులు ఒమ్మి అప్పారావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కె.ఆర్. కుమార్‌మంగళం, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, మణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ ఫోకస్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శివశంకర్ రెడ్డి, సురేష్,ప్రిన్సిపాల్ కె.వి. రమణ

కంచరపాలెం, ఆగస్టు 25 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో 'కెమికల్ హజార్డ్స్ &ఫైర్ హజార్డ్స్-కంట్రోల్ మేజర్స్ 'అనేఅంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, పారిశ్రామిక భద్రతా అధికారులు ఆర్ఎస్ఎన్ఆర్. సురేష్, ఆర్.మధు తదితరులు పాల్గొని పారిశ్రామిక భద్రత,ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలపై ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా అతిథులు చేతుల మీదుగా సేఫ్టీ ఫోకస్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెమికల్ కోర్సు విభాగాధిపతి డా.బీవీ లక్ష్మణరావు, సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, ఇండస్ట్రియల్ సేఫ్టీ,ఫైర్ సేఫ్టీ,కెమికల్ సేఫ్టీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు హాజరయ్యారు.

ఎంత పొడవైన పొట్లకాయలో...



పొట్లకాయలతో రైతు దేముడు

అక్కయ్యపాలెం, ఆగస్టు 25 : గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్‌లోని రైతుబజారులో తొమ్మిదడుగుల పొడవైన పొట్లకాయలు విక్రయానికి వచ్చాయి. కోటపాడు మండలం మర్రివలస గ్రామానికి చెందిన రైతు ఎం. దేముడు వీటిని తీసుకురావడంతో వినియోగదారులు ఆసక్తిగా తిలకించారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజా సమస్యల పరిష్కారవేదిక రద్దు

మహారాణిపేట, ఆగస్టు 25: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కారవే దిక కార్యక్రమం రద్దు చేసినట్టు కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు, కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.జిల్లా వాసులుఈ విషయాన్నిగమనించాలని కోరారు.0

విద్యా హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలుచేయాలి

సీతమ్మధార, ఆగస్టు 25: విద్యా హక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రాథమిక విద్యను తప్పనిసరిగా మాతృభాషలోనే అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వక్తలు పేర్కొన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఏపీ రైటు టు ఎడ్యుకేషన్ ఫోరమ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక విద్య మాతృ భాషలోనే సాగాలి అనే అంశంపై ఫోరం రాష్ట్ర కన్వీనర్ నవర ప్రకాశరావు అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. నగరానికి చెందిన విద్యావేత్తలు, భాషాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యపై విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని సూచించారు. ప్రాథమిక విద్యలో నైతిక విలువలు పెంపొందించేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ సదస్సులో డాక్టర్ సత్యమూర్తి, పి.కన్నయ్య, వేదుల కామేశ్వరశర్మ, వర్రే నాంచారయ్య, మేడ మస్తాన్ రెడ్డి, హుస్సేన్, దాట్ల బాబురావు రెడ్డి, పరవస్తు ఫణి శయన సూరి, సుజాత, బ్రాహ్మకుమారి రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

అప్పన్న ఆలయానికి తదుపరి ఈఓ ఎవరు ?

సింహాచలం, ఆగస్టు 25 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి తదుపరి ఈఓ ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత ఈఓ సింగాల శ్రీనివాసమూర్తిని గత ఏడాది సెప్టెంబరులో ఏడాది పాటు నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే నెలతో ఆయన పదవీ కాలం ముగియనుంది. విశాఖలో ఆర్డీఓగా పనిచేసిన శ్రీనివాసమూర్తి సెప్టెంబర్ 17, 2023న ఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో వైకుంఠ ఏకాదశి, వార్షిక తిరు కల్యాణోత్సవం, స్వామివారి నిజరూపదర్శనం చందనోత్సవం, గిరి ప్రదక్షిణ ఉత్సవాలన్నీ విజయవంతమయ్యాయి.

వార్షికోత్సవాలతో పాటు ఈఏడాది మార్చి ఆఖరి వారంలో ఐదు రోజుల పాటు సుదర్శన నారసింహ యజ్ఞాన్ని కూడా నిర్వహించి, భక్తుల మన్ననలు పొందారు. ప్రభుత్వం తనకు ఈఓగా ఇచ్చిన ఏడాది సమయం పూర్తి కావడంతో తనను మళ్లీ మాతృ సంస్థకు బదిలీ చేయాలని ఆయన ప్రభు త్వానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో దేవస్థానానికి తదుపరి ఈఓగా ఎవరిని నియమించాలన్న దానిపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మల్లగుల్లలు పడుతున్నట్టు తెలుస్తోంది. రెవెన్యూ శాఖ నుంచి నియమించేందుకు యోచిస్తున్నపటికీ ఆ శాఖకు చెందిన అధికారులెవరూ ఈఓగా వచ్చేందుకు మొగ్గు చూపడం లేదు.

ఈఓ పోస్టుకు అర్హత కలిగిన ఆర్‌జేసీ స్థాయి అధికారులు చంద్రశేఖర్ ఆజాద్, సురేష్‌బాబు, భ్రమరాంబ, త్రినాథరావు ఉన్నారు. అలాగే దేవాదాయ శాఖ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ గతంలో సింహాచలం ఈఓగా ఏడేళ్ల పాటు పనిచేసిన కొదూరి రామచంద్రమోహన్ పేరును కూడా ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

అన్నక్యాంటీన్‌కు ముస్తాబు

అక్కయ్యపాలెం, ఆగస్టు 25 : గ్రేటర్ 45వ వార్డు నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నగర్‌లోని అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. 2015లో టీడీపీ హయాంలో ఈ ప్రాం తంలో ఈ అన్నక్యాంటీన్‌ను ప్రారంభమైంది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని మూసివేశారు. అప్పటి నుంచి ఇప్పటినుంచి ఈ భవనం వృథాగా వదిలేశారు. ఇప్పుడు తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్‌ను పునః ప్రారంభించనున్నారు. దీనిలో భాగంగా ఈభవనానికి రంగులువేసి అధికారులు ముస్తాబు చేశారు.



45వ వార్డులో ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్

ఉక్కు ఉద్యోగులకు ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ నిలుపుదల

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 25: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఆర్జిత సెలవులు (ఈఎల్)ఎన్‌క్యాష్‌మెంట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులు ఇచ్చింది. 2021 నుంచి అధికారులకు 270, కార్మికులకు 170కు పైగా ఆర్జిత సెలవులుంటే ఇందులో ఏడాదికి గరిష్ఠంగా 30ఆర్జిత సెలవులను ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునే సదుపాయం గతంలో ఉండేది. పదవీ విరమణ ఉద్యోగులు ఒక నెల ముందు 30 సెలవులను ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునేందుకు వీలయ్యేది. ఇప్పుడు ఈ సదుపాయాలను నిలిపివేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మార్చి 31వరకు ఉత్తర్వులు అమల్లో ఉంటాయని యాజమాన్యం పేర్కొంది. ఇదిలాఉండగా, ఇటీవల ఉక్కు ఉద్యోగులకు అనేక అంశాల్లో కోతలు విధిస్తున్న యాజమాన్య తాజాగా ఈఎల్ విషయంలో ఉత్తర్వులు ఇవ్వటంతో ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

దొండపర్తిలో పారిశుధ్య లోపం



గ్రంథాలయం సమీపంలో దర్శనమిస్తున్న చెత్త కుప్ప

అక్కయ్యపాలెం, ఆగస్టు 25 : గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య లోపం నెలకొంది. రహదారులపై చెత్తకుప్పలు పేరుకుపోవడంతో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. చెత్త కుప్పల వల్ల వ్యాధులతో పాటు వివిధ రకాల జ్వరాలు విజృంభించే అవకాశం ఉంది. ఏ రోజుకు ఆ రోజు పారిశుధ్య కార్మికులు చెత్త కుప్పలు తొలగించకుండా వదిలేస్తున్నారు. దీని వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. అధికారులు స్పందించి దొండపర్తి, నెహ్రూబజారు, గ్రంథాలయం తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలు తొలగించి పారిశుధ్య కల్పనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టెండర్లలో మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి


వేస్తున్నారని మిగిలినవారు ప్రశ్నిస్తున్నారు. అంచనాలు తయారుచేయడంలోనే లోపం ఉందా? లేదంటనే పనులు చేయకుండానే కనికట్టు చేస్తున్నారా? అనేది అధికారే స్పష్టంచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలపై జీవీఎంసీ కమిషనర్ దృష్టిసారించకపోతే భవిష్యత్తులో నగరంలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత 'ఎండమావిగా' మారడం ఖాయమంటున్నారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ సెంటర్

... 5వ పేజీ తరువాయి

గగనమవుతుండడంతో బాధితులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తు న్నారు. ఈ తరహా ఇబ్బందులకు చెక్‌పెట్టేలా సీబీఆర్ఎన్ సెంటర్ ఉపకరిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎల్జీ పాలిమర్స్ వంటి ఘటనలు జరిగినప్పుడు సెకండరీ లెవెల్ కెమికల్ విభాగంలో ఉండే వైద్య సిబ్బంది సేవలు అంది స్తారు. గ్యాస్ పేలుడు, కొవిడ్ వంటి వైరస్‌లు వ్యాప్తి చెందిన ప్పుడు బయోలాజికల్ విభాగానికి చెందిన వైద్య బృందం, పరిశ్రమల్లో రేడియేషన్‌కు సంబంధించిన పదార్థాల పేలుడు జరిగినప్పుడు ఆ విభాగ సిబ్బంది అందుబాటులో ఉండి బాధితులకు మెరుగైన వైద్యం అందించనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం విమ్స్‌లో పనిచేసే వైద్య సిబ్బందికి అడ్వాన్స్‌డ్ శిక్షణ అందిస్తారు. పరిశ్రమల్లో, నేవీ, ఆర్మీడిపార్ట్‌మెం ట్‌ల వద్ద న్యూక్లియర్ పదార్థాలుంటాయి. పొరపాటున, లేదా ప్రమాదవశాత్తు పేలుడు జరిగినా, లీక్ అయినా తక్షణ వైద్యసాయం అందించేందుకు ప్రత్యేకంగా న్యూక్లియర్ బ్లాక్ ను ఏర్పాటుచేస్తారు. ఈ విభాగాల్లో పనిచేసే వైద్య సిబ్బం దికి కేంద్ర ప్రభుత్వమే జీత, భత్యాలను చెల్లించనుంది.

తుది తనిఖీలతో గ్రీన్‌సిగ్నల్



ఇటీవల సంభవించిన ప్రమాదాల్లో బాధితులకు వైద్య సేవలు అందించడంలో యంత్రాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. సీబీఆర్ఎన్ సెంటర్ అందుబాటులోకి వస్తే అడ్వాన్స్‌డ్ వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర బృందం తనిఖీలు నిర్వహించి, తుది అనుమతులు ఇవ్వనుంది. భవన నిర్మాణానికి సంబంధించిన డిజైన్ సిద్ధమైంది. కేంద్ర బృందం పర్యటన తరువాత పను లు ప్రారంభం కానున్నాయి. భవన నిర్మాణానికి కేటాయిం చిన స్థలం, సిబ్బంది నియామకం వంటి అంశాలపై కేంద్ర బృందంతో చర్చిస్తాం.

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

నీటి వనరుల పరిరక్షణపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

క్రమేణా తగ్గిపోవడంతో పాటు ముసురు వాతావరణం కనిపించడం లేదు. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గాలిలో తేమశాతం పెరుగుతోంది. నగర విస్తరణలో భాగంగా అనేకచోట్ల నీటి వనరులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ప్రస్తుతం జీవీఎంసీ విస్తీర్ణం 681 చదరపు కిలోమీటర్లు. ఉపాధి నిమిత్తం నగరానికి వలసలు పెరగడంతో ఏర్పడిన మురికివాడలు, పరిశ్రమలు, వాహనాల కాలుష్యం పరిధికి మించుతోంది.

నాడు 179 తాగునీటి వనరులు

సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన టోప్ షీట్ ఆధారంగా నగరంలో జీవీఎంసీ అధికారులు 215 నీటి వనరులున్నట్టు గుర్తించారు. పట్టణీకరణతో జీవీఎంసీ జోన్ 3,4,5లో ఒక్క చెరువు కూడాలేదు. జోన్-1లో 22 నీటివనరులు, జోన్ 2లో 15, జోన్-6లో 100, జోన్-7లో తొమ్మిది, జోన్-8లో 28 నీటివనరులు (చెరువులు) ఉన్నాయి. సింహాచలం దేవస్థానం పరిధిలో రెండు చెరువులు, 15 నీటి ధారలు ఉండగా, నగర శివారుల్లో 90 శాతం చెరువుల కింద సాగు చేయడంలేదు. నగరం బౌల్ ఏరియాలో ఉండడంతో వర్షం నీటిలో మూడు నుంచి ఐదుశాతం మాత్రమే భూమిలోకి ఇంకుతుండగా మిగిలిన నీరు సముద్రంలో కలుస్తోంది.

ఇక నగరంలో చెరువులు, గెడ్డలు అంతరించిపోగా శివారు ప్రాంతాల్లో చెరువులకు వర్షం నీరు వచ్చే కాలువలు మూసివేశారు. గొలుసుకట్టు చెరువులు ప్రమాదంలో పడ్డాయి. ఆటోనగర్, కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో చెరువులు మురికికూపాల్లా మారిపోయాయి. ఎండాడ జంక్షన్‌లో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చెరువుకు కొండ నుంచి వచ్చే వరదనీటి ప్రవాహాలను మూసివేశారు. మధురవాడజాతర సమీప చెరువు ఆక్రమించేశారు. మారికవలస, రుషికొండ ప్రాంతాల్లో వాగులు, గెడ్డలు పూడ్చి వేశారు. నగరంలో నీటి వనరుల వినియోగం పెరగడం, సహజ నీటి వనరులు ఉనికి కోల్పోవడంతో ఇక్కట్లు మొదలయ్యాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది.

తొలుత మూడు అంశాలపై ఫోకస్

నగరంలో సహజ నీటి వనరులను కాపాడుకోవాలన్న ప్రతిపాదనలపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో ధ్యాన్ ఫౌండేషన్ ప్రతినిధులు చర్చించారు. తరువాత కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆధ్వర్యంలో పలు విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చేనెలాఖరులోగా నగరం పరిసరాల్లో చెరువులు, నీటి వనరులను గుర్తించి, ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూశాఖకు కలెక్టర్ ఆదేశించారు. వచ్చేనెల 15లోగా చెరువులు, గెడ్డల్లో పూడిక తీసివేత, మురుగునీరు, చెత్తా, చెదారం తొలగింపు, మదుములు, కల్వర్టుల పునరుద్ధరణపై నివేదిక ఇవ్వాలని జీవీఎంసీ, ఇరిగేషన్, డ్వామా, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించారు. ఆ నివేదికలను పరిగణనలోనికి తీసుకుని మూడు అంశాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెడతారు.

నరవ ప్రాంతంలో పది గొలుసుకట్టు చెరువులు, కాపులుప్పాడ ఏరియాలో ఎనిమిది, పెందుర్తి సమీప రాంపురంప్రాంతంలో చెరువులు పునరుద్ధరిస్తారు. పైనుంచి వర్షం నీరు వచ్చేలా వాగులకు మరమ్మతులు చేస్తారు. ఒక చెరువు నుంచి మరో చెరువుకు నీటి ప్రవాహం దారుల్లో అడ్డంకులు తొలగిస్తారు. మదుములు, కల్వర్టులు బాగుచేస్తారు. రెండోది... ఆటోనగర్, కొత్తపాలెంలోని రెండు చెరువుల్లో మురుగునీరు, పూడిక తొలగిస్తారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటిని ఈ రెండు చెరువులకు పంపుతారు. అక్కడ సహజసిద్ధంగా నీరు శుద్ధి అయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. ఇక సీతమ్మధార నుంచి మాధవధార, సింహాచలంవైపుగా మొత్తం 15 జల ధారలున్నాయి. ఇవి ఏడాది పొడవునా ప్రవహిస్తుంటాయి. వీటిని కాపాడుకోవాలంటే... కొండలపై చెక్ డ్యామ్‌లు, కాంటార్లు ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. మూడు అంశాలకు డ్వామా, జీవీఎంసీలో డ్వాక్రా సంఘాల సేవలు తీసుకుంటారు. సర్వే పూర్తైన తరువాత పనులు చేపడతారు. వచ్చే ఏడాది మే నెలాఖరునాటికి సహజ వనరుల పునరుద్ధరణ పూర్తిచేయాలని లక్ష్యంగా ప్రణాళిక అమలుచేయనున్నారు.

గోస్తనీలో ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట


గోస్తనీ నదిలో ఎక్స్‌కవేటర్‌లో ట్రెంచ్ తవ్విస్తున్న వీఆర్వో

పద్మనాభం, ఆగస్టు 25: మండలంలోని రేవిడి వద్ద గోస్తనీ నదిలో ఇసుక అక్రమ తవ్వకాల నిరోధించడానికి ఆదివారం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. 'గోస్తనీలో దొంగలు పడ్డారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై తహసీల్దారు ఎం.ఆనందకుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఇసుక రవాణాను నిరోధించడానికి వీఆర్వో కావ్య ఈట్రెంచ్‌లను ఏర్పాటు చేశారు. పోగులు పోసిన ఇసుకను తహసీల్దారు కార్యాలయం వద్దకు తరలించనున్నట్టు ఆర్ఐ కోటి చెప్పారు.

బీజేపీలోకి వైసీపీ నేత


బీజేపీలో చేరిన వైసీపీ నేత వర్మ

సింహాచలం, ఆగస్టు 25: గ్రేటర్ 98వ వార్డుకు చెందిన వైసీపీ జిల్లా కార్యదర్శి రచ్చా శ్రీనివాస ఆనందవర్మ బీజేపీలో చేరారు. ఆదివారం నగరంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు సమక్షంలో ఆయన అనుచరులతో చేరారు. ఈ సందర్భంగా దేశ ప్రధానికిగా నరేంద్ర మోదీ చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి పనులను చూసి బీజేపీలో చేరినట్టు ఆనందవర్మ చెప్పారు.

కరాటే విజేతలకు బహుమతులు ప్రదానం

కొమ్మాది, ఆగస్టు 25: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని టీడీపీ ఆరో వార్డు అధ్యక్షుడు దాసరిశ్రీనివాస్ అన్నారు. ఆదివారం పి.ఎం.పాలెం అవంతి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఆయన ముఖ్య అతిథిగా హజరై బహుమతులను అందచేశారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలను తిలకించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రమణయాదవ్ సేవలు ప్రశంసనీయం

భీమునిపట్నం, ఆగస్టు 25: మార్షల్ ఆర్ట్స్‌లో షాడో వారియర్స్ మార్షల్స్ ఆర్ట్స్ ఫౌండర్ ఎం.వెంకటరమణ యాదవ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కొనియాడారు. ఆదివారం పట్టణంలో ఆ సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులకు నైపుణ్యత గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా, రెడ్, గ్రీన్, బ్లూ, ఎల్లో బెల్ట్‌లను విజేతలకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొక్కిరి అప్పన్న, నర్సింగరావు, దేవేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

కొమ్మాది, ఆగస్టు 25: మధురవాడ పరిసర ప్రాంతాల్లో కరెంట్ కోతలో ప్రజలు అల్లాడుతున్నారు. వేసవిని తలపించే రీతిలో ఉష్ణోగ్రతలతోపాటు ఉక్కపోత వేధిస్తుంది. ఈ సమయంలో అప్రకటిక విద్యుత్ కోతలు విధించడంపై జనాలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. మధురవాడ, కొమ్మాది, మారికవలస, పి.ఎంపాలెం, ఉడాకాలనీ తదితర ప్రాంతాల్లో సమయ పాలన లేకుండా రాత్రిసమయాల్లోనూ కరెంటు సరఫరా నిలిపివేస్తున్నారు. అధికారులు స్పందించి ఇకనైనా కరెంటు కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం


ఆనందపురంలో హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

ఆనందపురం, ఆగస్టు 25: మండలంలోని గంభీరం పంచాయతీ పరిధిలోని ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆ ధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. 108 పలకలతో హరినామ జపమండపాన్ని ఏర్పాటు చేసి సుమారు మూడు వేల భక్తులతో 108 సార్లు హరినామ జపం జరిపారు. అనంతరం బాలగోపాల స్వామి ఉయ్యాల సేవలో భాగంగా బృందావనమ్ నుంచి వచ్చిన లడ్డూగోపాలునికి ఉయ్యాలలో వేసి భక్తులు స్వయంగా సేవ నిర్వహించారు. అనంతరం 108 మంది ప్రసిద్ధ కళాకారులతో సామూహిక భజగోవిందం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.


సంగీత కచేరిలో ఆలపిస్తున్న గాయకులు

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో...

విశాలాక్షినగర్: నగరంలోని గాది రాజు ప్యాలెస్‌లో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యియి. ఈ సందర్భంగా 108 కలశాలు, పళ్ల రసాలు, తదితర వాటితో అభిషేకాలు నిర్వహించారు. ప్యాలెస్ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఈసందర్భంగా నిర్వహిస్తున్నారు. 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అలానే సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తారు.

వైశాఖేశ్వరస్వామికి గ్రామోత్సవం

కొమ్మాది: కొమ్మాది అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీదేవాలయం ఆవరణలోని వైశాఖేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయధర్మకర్తలు అన్నంరాజుసత్యనారాయణ, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో 108 కలశాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయ శిఖరానికి అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, వైశాఖేశ్వర స్వామి మంగళగౌరి కల్యాణోత్సవాన్ని ప్రధాన అర్చకులు చక్రధరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కొమ్మాది: కొమ్మాది జంక్షన్ లక్ష్మీటవర్స్‌లో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాపలువురు చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో అలరించారు.


గాదిరాజు ప్యాలెస్‌లో కొలువైన రాధాకృష్ణులు


అన్నంరాజునగరంలో ఊరేగింపు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భీమునిపట్నం, ఆగస్టు 25: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976-79వరకూ 8,9,10 తరగతులు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆ హైస్కూల్‌లో జరిగింది. ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కనకల సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సుమారు 44 ఏళ్ల క్రితం కలుసుకోవడంతో ఒకరికొకరు క్షేమసమాచారం అడిగి తెలుసుకున్నారు. తొలుత పూర్వ విద్యార్థి కె.సన్నిబాబు ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథులుగా ప్రస్తుత జూనియరు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.సూర్యప్రసాద్, ఈ హైస్కూల్ ప్రస్తుత హెచ్ఎం పొన్నగంటి రమణ, కళాసాహితి అధ్యక్షుడు పీఆర్‌పీ వర్మ, సీనియర్ న్యాయవాది మరుపిళ్ళ చిన్నయ్యపాత్రుడు, కశింకోట ఎంపీడీవో రవికుమార్, శతాబ్ది ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా, భీమిలి చారిత్రక కథలు రాసిన వర్మను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల తరపున ఆ పాఠశాలకు మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోర అప్పలరెడ్డి, అడిదం వెంకట శేషగిరి, చందక సూరిబాబు, చోడవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రేఖ రామారావు, రియల్ ఎస్టేట్ కలిగొట్ల వెంకట భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు. ముగ్గురు పూర్వ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.


భీమిలి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, ఆగస్టు 25: వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం అనంతపురం జిల్లాకు చెందిన శాసన సభ్యులు ఎ. సురేంద్రబాబు, ఇంటలిజెన్స్ బ్యూరో (సెంట్రల్) ప్రత్యేక డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్ (ఐపీఎస్), జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు పీవీ నరసింహం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి నక్క ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలోకి వెళ్లిన ప్రముఖుల గోత్రనామాలతో అర్చకులు స్వామివారికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు వేదాశీర్వచనాలిచ్చారు. ప్రహ్లాదవరదుడైన సింహాచల వరాహలక్ష్మీనారసింహునికి వైభవంగా పసడి కుసుమార్చన నిర్వహించారు. ఇందులోభాగంగా ఆదివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవి సమేతం శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధి ష్ఠింపజేశారు. అనంతరం ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని ఉదయం 9.30గంటలకు పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో వైభవంగా నిర్వహించారు.


కప్పస్తంభం వద్ద ఇంటలిజెన్స్ బ్యూరో (సెంట్రల్) డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్

సేవల్లో అంకితం కావాలి

భీమునిపట్నం, ఆగస్టు 25: ప్రజాసేవా కార్యక్రమాలలో లయన్స్ సభ్యులు ముందుండాలని లయన్స్ డిస్ట్రిక్టు 316ఎ గవర్నర్ ఎస్‌వీబీఎస్ఎస్ ప్రసాద్ సభ్యులను కోరారు. ఆదివారం భీమిలి సాయిసదనంలో భీమిలి సెంటేనియల్ లయన్స్ క్లబ్ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా, పట్టణంలోని ఎస్‌డబ్ల్యూబీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు 175 మంది కి టవల్స్, కొబ్బరి నూనె బాటిల్స్, డెట్టాల్ సోప్స్ తదితర కాస్మోటిక్స్‌ను ఉచితంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎ రాబోస్ గ్రూపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ్ బొండా, హరిప్రియ బొండా, అనికారాం బొండా, లయన్స్ వైస్ డిస్ట్రిక్టు గవర్నర్స్ సూర్యప్రకాష్, కెవి సుబ్బరాజు, కేబినేట్ సెక్రటరీలు గోపాలకృష్ణ, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కాస్మోటిక్స్ అందిస్తున్న దృశ్యం

వైభవంగా అనంతపద్మనాభుని లక్ష తులసీ పూజ

పద్మనాభం, ఆగస్టు 25: పద్మనాభంలోని అనంతపద్మనాభుని క్షేత్రంలో లక్ష తులసి దళ పూజా కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ఈఉత్సవంలో భాగంగా ముందుగా అనంతుని ఉత్సవ విగ్రహాలు, కుంతీమాధవస్వామి మూలవిరాట్టులకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవానికి అవసరమైన తులసి దళాలను వేదమంత్రోచ్చరణలతో ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేసి ఆలయంలోకి తీసుకువెళ్లారు. వేదపండితుల ఆధ్వర్యంలో సహస్ర నామస్మరణతో స్వామివారిని లక్ష తులసి దళార్చనను వైభవంగా పూర్తి చేశారు. అనంతరం లక్ష్మీదేవికి కుంకుమార్చన చేశారు. ఈఉత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పి.సీతా రామాంజనేయస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్, నాయకులు ఎర్నాయుడు, పద్దు, పైడిరాజు, నారాయణరావు, సన్నిబాబు పాల్గొన్నారు.


తులసీ దళాల అలంకరణలో పద్మనాభ స్వామి


కుంతీమాధవస్వామి ఆలయ చుట్టూ తులసీ దళాలను ఊరేగిస్తున్న దృశ్యం

వినాయక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు

మధురవాడ, ఆగస్టు 25: గ్రేటర్ 7వవార్డు చంద్రంపాలెంలో 33 అడుగుల భారీ గణనాథుడు కొలువుతీరనున్నాడు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు చేతులు మీదుగా వినాయక ఉత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు పిళ్లా రాము, పిళ్లా మోహనకృష్ణ, గ్రామపెద్దలు పిళ్లా చంద్రశేఖర్,పిళ్లా శ్రీనివాసరావు,జగపిల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

భీమిలి తీరంలో సందర్శకుల సందడి


భీమిలి బీచ్‌లో సందర్శకులు

భీమునిపట్నం, ఆగస్టు 25: భీమిలి బీచ్ ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. వారాంతపు సెలవు కావడంతో విశాఖనగరం నుంచేగాక, విజయనగరం, శ్రీకాకుళం సరిహద్దు జిల్లాల నుంచి కూడా సందర్శకులు రావడంతో తీరం కిటకిటలాడింది. సాగరకన్య విగ్రహం వద్ద సందర్శకులు ఆనందంతో ఫొటోలు తీసుకున్నారు. సముద్రకెరటాల్లో ఉల్లాసంగా జలకాలాడారు. ఇసుకతిన్నెలపై ఆనందంగా గడిపారు. గాంధీజీ పార్క్, బీచ్‌పార్క్‌లలో పిల్లలతో ఆటపాటలతో ఆనందాన్ని పొందారు. అలాగే, మంగమారిపేట రామాద్రి బీచ్, కొబ్బరితోట పార్క్‌లు కూడా సందర్శకులతో కిటలాడాయి.

సాగర్‌నగర్: రుషికొండ తీరంలో ఆదివారం సందర్శకులు సంఖ్యపెరిగింది. చల్లగా ఆహ్లాదకరంగా ఉన్న వాతావరణాన్ని ఆస్వాదించారు. సముద్ర స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. సాగర్‌నగర్ బీచ్ సందర్శకులతో కిటకిటలాడింది. వాతావరణం అనుకూలించకపోవడంతో బీచ్‌లో బోటుషికారు ముందస్తు చర్యగా నిలిపివేశారు.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 47, టమాటా 27, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 22, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజ్ 26, క్యారెట్ 32, దొండకాయలు 26, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 120, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వె ల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 40, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులకు ఆలిండియా ర్యాంకులు

సిరిపురం, ఆగస్టు 25: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫైనల్, సీఎంఏ ఇంటర్ ఫలితాలలో మాస్టర్‌మైండ్స్ వైజాగ్ బ్రాంచి విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించినట్టు బ్రాండ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ సిహెచ్.అంజిరెడ్డి, అకడమిక్ ప్రిన్సిపాల్ దినేష్ తెలిపారు. సిరిపురం వీఐపీ రోడ్డులోని కార్యాలయంలోని ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఏ ఇంటర్‌లో కె.సంపత్‌కుమార్ 26వ ర్యాంకు, పి.హేమంతసాయి 32వ ర్యాంకు, జి.వెంకటరమణ 44వ ర్యాంకు, కె.చంద్రశేఖరరావు 50వ ర్యాంకు సాధించారన్నారు. సీఎంఏ ఫైనల్‌లో విద్యార్థులు ఆర్.సాయికుమార్ 15వ ర్యాంకు, ఆర్.అనూష 22వ ర్యాంకు, పి.సౌమ్య 39వ ర్యాంకు సాధించారని చెప్పారు.

పాతవెంకోజిపాలెంలో అన్నసమారాధన

వెంకోజిపాలెం, ఆగస్టు 25: పాతవెంకోజీపాలెంలోని కనకమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యవర్గ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

పెదగదిలిలో...

ఆరిలోవ: పెదగదిలిలో లక్ష్మీగణపతి ఆలయం ఆరో వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ ప్రతినిధి బి.గోవింద్ అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిహెచ్.పైడిరాజు, సభ్యులు అప్పలనాయుడు, పిట్టా శంకర్, సురేష్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కు ఆదాయం రూ.3.5 లక్షలు

ఆరిలోవ, ఆగస్టు 25: ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు సందర్శకులు తాకిడి పెరిగింది. ఆదివారం సుమారు 3800 మంది పార్కును సందర్శించారు. వీరి నుంచి రూ.3.5 లక్షల ఆదాయం సమకూరిందని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు.

హత్యాచార ఘటనపై నిరసన

సిరిపురం, ఆగస్టు 25: కోల్‌కతా హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మహిళలపై జరుగుతున్న దాడుల్లో నిందితులను శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు పడాల వీరభద్రరావు, ఎస్.చంద్రశేఖర్, ఏయూ ఆచార్యులు కోలవెన్ను, వెంకటరమణ, సత్యవతి, శ్రీనివాసరావు, హర్షవల్లి, హీనా, వెంకటేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సంప్రదాయాలను అలవర్చుకోవాలి

నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి

సిరిపురం, ఆగస్టు 25: విద్యార్థులు దేశ, రాష్ట్ర సంప్రదాయాలను అలవర్చుకోవాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచించారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో భరతనాట్య కళాంజలి అధ్యక్షులు గురువు సంతోషివిజయ్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులతో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన వివిధ భరతనాట్య ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. కళలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. విశిష్ట అతిథి కన్నం వెంకటరమణారావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి నాట్యం నేర్చుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు నాట్యాన్ని పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరిరామమూర్తి మాట్లాడుతూ భరతనాట్యాంజలి గత పదేళ్లుగా అనేక మంది విద్యార్థులను భరతనాట్య కళాకారులుగా తీర్చిదిద్దడం సంతోషకరమన్నారు. అనంతరం నిర్వహించిన కూచిపూడి కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాక్షేత్ర ప్రొఫెసర్ వసుంధర థామస్, సిద్ధయోగి కళా నిలయం ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.వి.సత్యభాను తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

విశాఖ కళలకు రాజధాని: సీపీ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, ఆగస్టు 25: విశాఖ కళలకు రాజధానిగా నిలుస్తోందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చెప్పారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్‌డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందుస్థానీ గాత్ర కచేరిని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు కళలకు కూడా పుట్టినిల్లు వంటిందన్నారు. ఆధునికీకరణ ప్రపంచంలో దేశ సంప్రదాయాలు మర్చిపోకూడదని ఆయన సూచించారు. భవిష్యత్ తరాలకు కూడా కళల పట్ల ఆసక్తి కలిగించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కళలను ప్రోత్సహించి కళాకారులను ఆదుకోవాలన్నారు. ముందుగా కమిషనర్‌ను కళాభారతి నిర్వాహకులు మంతెన సత్యనారాయణ, గుమ్మలూరి రాంబాబు సత్కరించారు. అనంతరం ఢిల్లీ ఘరానా విద్వంసురాలు మీటా పండిట్ హిందుస్థానీ గాత్ర కచేరితో మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, కళాభిమానులు పాల్గొన్నారు.


సీపీ బాగ్చిని సన్మానిస్తున్న కళాభారతి నిర్వాహకులు

అదరహో అనిపించిన శ్రావణలక్ష్మి ర్యాంప్ వాక్

పెదవాల్తేరు, ఆగస్టు 25: క్వీన్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శ్రావణలక్ష్మి పేరుతో ఆదివారం ఓ హోటల్‌లో నిర్వహించిన సంప్రదాయ ర్యాంప్ వాక్ విశాఖ వాసులకు అదరహో అనిపించింది. సంప్రదాయ ర్యాంప్ వాక్ షోలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా నుంచి హజరైన పలువురు వివాహితులు సంప్రదాయ చీరకట్టుతో మిసెస్ శ్రావణలక్ష్మి విభాగంలో లంగాఓణీలతో యువతులు మిస్ శ్రావణలక్ష్మి విభాగంలో ర్యాంప్‌పై నడుస్తూ అదరహో అనిపించారు. ముఖ్య అతిథిలుగా పలువురు నాయకులు పేడాడ రమణికుమారి, రమా సత్యనారాయణ, విజయ స్వాతిలతో కలిసి క్వీన్స్ ఈవెంట్స్ నిర్వాహకురాలు మోదవలస ఉషారాణి జ్యోతి ప్రజ్వలన చేశారు. న్యాయనిర్ణేతలుగా సంగీత, స్వర్ణలత, మాధురి, నక్షత్ర వ్యవహరించారు.


సంప్రదాయ ర్యాంపు వాక్ చేస్తున్న మహిళలు